జ్ఞాన యోగం

# ఆత్మానాత్మ వివేక దర్శిని



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ఆర్కైవ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ఆర్కైవ్ వారి వెబ్ సైట్: https://archive.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ఆర్కైవ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## ఆర్కైవ్ వారి వెబ్ సైట్:

## https://archive.org/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.




రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!


మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఆత్మానాత్మ
## వివేక దర్శిని




సంకలన కర్త
విజ్ఞానస్వరూప్ కోసూరు మురళీకృష్ణారావు
చల్లపల్లి, కృష్ణాజిల్లా.

ప్రతులు: 1000
ముద్రణ: జూలై 2011

వెల: అమూల్యము

ప్రతుల కొఱకు

కోసూరు మురళీకృష్ణారావు
డోర్ నెం: 13-52
అగ్రహారం, చల్లపల్లి (పోస్టు)
కృష్ణాజిల్లా, 521126
ఫోన్ నెం: (08671) 224516

## పీఠిక

ప్రపంచములోని మతాలన్నీ దేవుడున్నాడనియు, ఆ దేవుని కొఱకు భక్తి, విశ్వాసము, పూజ, ఆరాధన, ధ్యానము, యోగము, అని అనేక పద్ధతులలో ఏదో ఒకటి చేయమని ప్రచారం చేస్తూ ఉంటాయి. ఫలితముగా స్వర్గము, పరలోకము, మోక్షమని తెలిపి ఆనంద మనుభవించ గలమని సూచించుచు, దేవుని ఇచ్ఛప్రకారము చేయనిచో నరకమని, దుఃఖమని, బాధలని హెచ్చరిస్తూ ఉంటాయి.

జనులు మాత్రము ఆ యా మతాల నవలంబించుచు, అలవాటుగానో, కాలక్షేపముగానో, మతసంబంధమైన కర్మకాండలు ఆచరించుచున్నారు. కాని చాలామంది సామాన్యులు తెలుసుకొనవలసినవి దేవుడు ఎలా ఉంటాడు? ఏమి చేయగలడు? మన జీవితంలోని సుఖదుఃఖాలకు కారణం ఎవరు? మనమేనా? లేక దేవుడా? శారీరక, మానసిక బాధలకు పరిష్కారమున్నదా? ఉంటే అది భక్తి ద్వారానా? యోగము ద్వారానా? లేక జ్ఞానము ద్వారానా? దేవుని నమ్మకపోతే కలిగే నష్టమేమిటి?

ఈ సందేహములకు సమాధానముగా వివరణ యిచ్చుటకు గాను యీ పుస్తకమును వ్రాయ సంకల్పించడమైనది. మానవునిలో శరీరము, ఇంద్రియాలు, ప్రాణము, మనస్సు, బుద్ధి మరియు **నేను** అనెడి చైతన్యమున్నాయి. **నేను** అనెడిదానిని వేరుచేయగా అదే **ఆత్మ**. మిగిలిన శరీర ప్రాణ మనస్సులన్నియూ కలిపి అనాత్మ యందురు. అందువలన మానవునిలో ఆత్మకు అనాత్మకున్న భేదమును తెలిపి, అందులో **నేను ఎవరు**? అను ప్రశ్నకు **నేను ఆత్మను** అనే సమాధానమును అందించ పూనడమైనది. మరింత వివరముగా అనాత్మయైనట్టి, మూడుశరీరములను, మూడు గుణములతో కూడిన అజ్ఞానమును వివరించుచు, ఆత్మయనగా



బ్రహ్మమేనని నాల్గు మహావాక్యములద్వారా తెలియ జేయడమైనది.

అజ్ఞానము, అజ్ఞాన కార్యములు మరియు పునర్జన్మ హేతువైన విషయపంచకము, అరిషడ్వర్గము, రాగద్వేషముల వలనను ఈషణత్రయము వలనను జరిగే ప్రమాదమును వివరించడమైనది. వీటిని అధిగమించుటకు చేయవలసిన సాధనలో భాగముగా సనత్సుజాత మహర్షి ధృతరాష్ట్రునికి వివరించినట్టి చేయవలసిన సత్కర్మలను, చేయకూడని దుష్కర్మలను వివరించడమైనది. సాధనాచతుష్టయ సంపత్తి మొదలగు వానిని తెలియజేసి, సాధనకును, బ్రహ్మవిద్యార్జనకును అందరూ అర్హులేనని శాస్త్రవాక్యముల ద్వారా తెలియజేయడమైనది. ఎప్పటికైనను, ఆత్మానాత్మ వివేకము, మోక్షసాధన అందరికి తప్పనిసరి అని చెప్పడమైనది.

అపరోక్షానుభూతియను గ్రంథ రచయతచే వ్రాయబడిన తెలుగు పద్యముల నిందు పొందుపరచి వారికి కృతజ్ఞతలు చెల్లించడమైనది. వేమన మొదలగు వారి పద్యములను ఉదహరించుటకు కూడా స్వతంత్రించడమైనది. అలాగే పురాణ ఇతిహాసములను దృష్టాంతముల కొఱకు ఉపయోగించడమైనది. సాధారణ మానవులకు అర్థమయ్యే రీతిగా శాస్త్రీయ పరిభాషను వ్యావహారిక భాషగా మార్చి చెప్పే ప్రయత్నము జరిగినది. ఈ సందర్భముగా తెలియజేయదలచిన విషయములను వేటినీ వదలకను, గ్రంథమును మరీ పెద్దది కాకుండునట్లు, సాధ్యమైనంత కుదించి, తక్కువ పుటలలో ఒక పరిచయ పుస్తకముగా తీర్చిదిద్దడమైనది.

దీనివలన ఎంతో కొంతమందికి ఆసక్తి కలిగి, ఆధ్యాత్మిక జీవనం వైపు మరలినట్లయితే, వారికివే విషయములను వివరముగా నందించు గ్రంథములు చాలానే యున్నవి మరియు సత్సంగము జరుపు వారు కూడా చాలామంది గలరు. ఏదో ఒక పద్ధతిని ఆశ్రయించి తరించగలరు గాక!

విజ్ఞానస్వరూప్

# దైవ ప్రార్థన

### గణపతి

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ॥

### సరస్వతి

సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥

పద్మపత్ర విశాలాక్షీ పద్మకేసర వర్ణినీ
నిత్యం పద్మాలయాం దేవీ సామాం పాతు సరస్వతీ ॥

### ఈశ్వరుడు

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందు బరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుండెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్ ॥



# గురు స్తోత్రం

1. గురు బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
   గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

2. హృదయాంబుజే కర్ణిక మధ్య సంస్థే
   సింహాసనే సంస్థిత దివ్యమూర్తిం
   ధ్యాయేద్గురుం చంద్రకళా ప్రకాశం
   సచ్చిత్సుఖాభీష్టవరం దధానం ॥

3. శ్వేతాంబరం శ్వేతవిలేప పుష్పం
   ముక్తావిభూషం ముదితం త్రినేత్రం
   వామాంక పీఠస్థిత దివ్యశక్తిం
   మందస్మితం సాంద్ర కృపా నిధానం ॥

4. ఆనందమానందకరం ప్రసన్నం
   జ్ఞానస్వరూపం నిజబోధయుక్తం
   యోగీంద్ర మీడ్యం భవరోగ వైద్యం
   శ్రీమద్గురుం నిత్యమహం నమామి ॥

5. బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
   ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం
   ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
   భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥

## విషయసూచిక

1. ఉపోద్ఘాతము

2. మానవ జన్మ సార్థకత

3. గురువు – శిష్యుడు

4. శ్రవణం – మననం – నిధిధ్యాసనం

5. నేను ఎవరు?

6. శరీరత్రయ విచారణ

7. పునర్జన్మ

8. కర్మలు

9. అజ్ఞానము

10. దుఃఖము, మరణము

11. సాధనా చతుష్టయ సంపత్తి

12. బ్రహ్మవిద్యకు అర్హులు

13. మహావాక్యములు

14. సాధన



## 1. ఉపోద్ఘాతము

మానవుల దైనందిన జీవితాలలో ఎవరిని గమనించినను అశాంతి, ఆందోళన, అభద్రత కనబడుచున్నది. ఇవి జాతుల మధ్య, కులాల మధ్య, ప్రాంతాల మధ్య పుట్టి, పెరిగిపోతున్నది. స్వార్థపరులు పెరిగి పోతున్నారు. మానవులలో కోరికలు తీర్చడానికి, బాధలు పోగొట్టడానికే దేవుడున్నాడని ఒక నమ్మకము. ఆ దేవుడు కోరికలను తీర్చకపోతే బాబాలను, యితరులను ఆశ్రయించి మోసపోవడం చూస్తున్నాము. ఈ విధమైన తీరు వెఱ్ఱితలలు వేయడము, సమాజము సరైన పంథాలో నడవకపోవడం జరుగుతున్నది. ఈ పరిస్థితికి పాలకులు పాలకులనెన్నుకునే ప్రజలు, ఉదాసీనంగా ఊరకుండే వారు, అందరూ బాధ్యులే. అన్యాయాన్ని ఆపకపోవడం వంటివి జరిగినప్పుడు, బాధితులలో తీవ్రవాదము, నేరప్రవృత్తి పెరిగిపోతుంది.

మానవులకు కావలసిన శాంతి దొరకాలంటే, వారి స్వభావాలు మారాలి. భగవంతుడంటే ఏమిటో తెలియాలి. మానవుడు ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాడో, ఎలా వచ్చాడో, తన గమ్యమేమిటో తెలియాలి. తన శాంతిని తానే సాధించే అవకాశము తనలోనే ఉన్నదన్న సత్యము వేదాంతము చెప్పుచున్నది. వేదాంతము అందరికీ అందుబాటులో లేదనుకున్నను, మనము ఈ ప్రజలనుండి కొన్ని వ్యాఖ్యానాలు వింటూ ఉంటాము. "ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు? పెట్టి పుట్టాలి, చేసుకున్నవాడికి చేసుకున్నంత, తనపాపాన తానే పోతాడు, దేవుడు చూస్తూ ఊరుకోడు. మంచి చేస్తే వచ్చే ఫలితము సుఖము, చెడు చేస్తే వచ్చే ఫలితము దుఃఖము. పుణ్యము కొద్ది పురుషుడు, దానం కొద్ది బిడ్డలు" అని అనేక వ్యాఖ్యానాలను వారికి తెలియునో తెలియదో గాని చాలా మంది వద్ద

వింటూ ఉంటాము. ఇన్నీ తెలిసి కూడా తాను చేయగలిగినట్టిది, తన చేతిలో ఉన్న పరిష్కారాన్ని కూడా మానవుడు చేయడం లేదు. అనగా అతడు ఈ విషయంలో తన వివేకాన్ని ఉపయోగించుట లేదన్నమాట. వ్యక్తి గతమైన సమాజగతమైన అన్ని సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారము ఆధ్యాత్మికత. అందువలన, ఇది అందరికీ తెలిసినదే యైనను, ఒక సారి ఆలోచింప చేయడానికి గాను, జన్మ, కర్మ, పునర్జన్మ, ఆత్మతత్త్వము మొదలైన వాటిని పునశ్చరణము చేస్తే మంచిదని భావించడమైనది. దీనితో అందరు మారిపోతారని ఆశించడము లేదుగాని, వ్యక్తి గతముగా కొందరైనను ఆత్మ శాంతిని పొందగలరనే చిరు ఆశమాత్రమున్నది. అందుకొఱకు మానవుని యొక్క జన్మ సార్ధకతకు అవసరమైన శాస్త్రీయమైన సాధనామార్గమును మనము కొంతమేరకు చర్చించి, విమర్శించుట మంచిదని భావన.



## 2. మానవ జన్మ సార్థకత

మానవజీవితం బుద్బుదప్రాయము. అనగా నీటి బుడగవలె అనిత్యము, అల్పము. మెలకువ, కల, గాఢనిద్రావస్థలుగా జరిగిపోతుంది. ఆకలి, దప్పిక, చలి, యెండ, వానల నుండి కాపాడుకోవడం, సంతానం కోరి మైథునం జరపడం, స్వయం కృతము వలనను, యితరుల వలనను, ప్రకృతి వలనను, కష్టాల పాలవడం, అనగా ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికముల వలన తాపత్రయ పడడం. ఇంతకంటే ఎక్కువ లేదు.

**ఆహార నిద్రా భయ మైథునాని సామాన్య మేతత్పశుభిః నరాణాం**
**జ్ఞానం నరాణాం అధికో విశేషో జ్ఞానేన హీనః పశుభిస్సమానః ॥**

ఆకలి, నిద్ర, భయము, మైథునమనునవి పశువులకు మానవులకు సమానమే. మానవుడు వీటినే తన తెలివితో మరింతగా తీర్చుకొనుచు, ఇంద్రియ భోగాలకు లోనగుచున్నాడు. అతిగా ఆశపడటం, మోహపడటం, ప్రాప్తించిన దానికి సంతోషపడటం, ప్రాప్తించకపోతే దుఃఖ పడటం జరుగుచున్నది. గతాన్ని తలచి దుఃఖించడం, భవిష్యత్తును గురించి ఆందోళన పడటం, ధనార్జన మీద అభిలాష, శ్రమ, తపన అధికము. మానవ బుద్ధి వికసించి, జ్ఞానార్జనకు అనుకూలముగా నున్నది. మోక్షము కొఱకు సాధన చేయని మనుష్యుడు పశువుతో సమానమగుచున్నాడు. భార్య పుత్రులు, బంధువులు, మిత్రులు మొదలగు వారితోను, ధన కనక వస్తు వాహనములతోను, సుఖాన్ని కోరి పెద్దసంసారమునే ఏర్పరచు కొనుచున్నాడు. కాని ఆశించినంత సుఖము లభించుట లేదు. మీదు మిక్కిలి దుఃఖము, కష్టము, నష్టము, సమస్యలు, ఆందోళన, దిగులు, శ్రమ, నిరాశ వంటివి ఫలితముగా వస్తున్నవి. శత్రువులు, అసూయ పరులు, మోసగాళ్ళ వలన మథనపడుచున్నాడు. ప్రయత్నించిన దానకి ఫలితము రానప్పుడు

దానికి దురదృష్టమని, విధియని, కర్మయని అనడము, అప్రయత్న లాభానికి అదృష్టమనియు పేర్లు పెట్టుచు, తాను సేద తీరడానికి దేవుడున్నాడని నమ్మడము లేక అదృశ్య శక్తి యేదో నడిపిస్తున్నదనటం మానవుని ఊహగా తయారయింది. కాని దైవము, దైవీస్థితి వీరికి తెలియదు. అయినప్పటికినీ కొందరు లోతుగా విచారించుచు అన్వేషించ సాగిరి. అన్వేషణ తపస్సుగా మారి, వారు ఋషులైరి. వారికి తమ తపస్సులో తెలియబడినవి వేదములనబడ్డాయి. కేవలము వినబడటము చేత శ్రుతులనియు, చెప్పబడలేదు కాబట్టి అపౌరుషేయాలనియు అనసాగిరి. ఇవి ఎవరి యొక్క అభిప్రాయముకాదు గనుక, వేదాలు ప్రమాణము. అభిప్రాయమైనప్పుడు వారివారి బుద్ధి లేక మతిని అనుసరించి యుండును కనుక, వాటిని మతములనవచ్చును. కొన్ని మతములు వేదములకు భాష్యములు చెప్పినవి కనుక, అవి వేద ప్రమాణమునకు సరిపోవచ్చును లేక సిద్ధాంత పరమైన భేదముండవచ్చును. విచారణ చేసినప్పుడు మత పద్ధతికంటే వేదప్రమాణమే శిరోధార్యము.

వేదాలు కర్మసూత్రాలను, ధర్మసూత్రాలను మోక్షమార్గమున కనుగుణముగా వివరించినవి. చివరకు బ్రహ్మసూత్రాలు ఆత్మ, బ్రహ్మ, పరబ్రహ్మ, మోక్షము అనువాటిని నిర్ణయించినవి. గురుశిష్య సంబంధముగా ప్రచురణమైన వేదాలను వ్యాసమహర్షి విభజించి, గ్రంథస్థము చేసి వేదవ్యాసు లనిపించుకొనిరి. ఈ వేదాలు (1) ఋగ్వేదము, (2) యజుర్వేదము, (3) సామవేదము, (4) అధర్వణ వేదము అని నాల్గు భాగములు. వేదవ్యాసుల శిష్యులైన పైల ఋషి ఋగ్వేదమును, వైశంపాయనఋషి యజుర్వేదమును, జైమిని ఋషి సామవేదమును, సుమంతఋషి అధర్వణ వేదమును క్రోడీకరించి, ఒక క్రమపద్ధతిలో పెట్టుటకు సహాయపడిరి.



ఇందలి మహావాక్యములు బ్రహ్మమును నిర్ణయించి మోక్షము మరియు దాని కొఱకు చేయవలసిన సాధన, విచారణ మార్గములను నిర్దేశించినవి.

ఇహ పర సుఖములకు ధర్మ, అర్థ, కామములను, చివరకు మోక్షమును వివరించి చతుర్విధ ఫలపురుషార్థములను తెలిపెను. తప్పని సరియైన నిత్య, నైమిత్తిక కర్మలను, సాధకుడు దాటవలసిన కామ్యక కర్మలను, నిగ్రహించవలసిన నిషిద్ధకర్మలను చివరకు మోక్షము కొఱకు నిష్కామకర్మయోగమును వివరించడమైనది.

మానవుని బుద్ధివికాసమును అనుసరించి అజ్ఞానము వలన కలిగిన జన్మ కర్మలనుండి తప్పించుకొనుటకును, జ్ఞాన సముపార్జనకును, తప్పక ప్రయత్నించవలెను. పెద్దలైన అనుభవజ్ఞులు నిర్ణయించిన పద్ధతి నవలంబించవలెను. గురువు యొక్క సహాయము ఎంతగానో అవసరమై యున్నది. పశుపక్ష్యాదులకు సాధ్యముకానిది యీ సాధనామార్గము. మానవులకు విచక్షణ, వివేకములుండుట వలన, మానవులకే ముక్తిని సాధించుటకు వీలగును. అందువలన మానవజన్మ సార్థకము. మానవజన్మ లక్ష్యమేమంటే సంపూర్ణ దుఃఖనివృత్తి మరియు పరమానందప్రాప్తి.

కనుక మానవుడు జ్ఞానాజ్ఞానాల వివరము తెలిసికొనుట, దేహేంద్రియ ప్రాణమనస్సులను విచారించి, తనలో తాను ఉండుటకు ఆధారమైన ఆత్మను తెలిసికొనుట మరియు పునర్జన్మ దుఃఖములనుండి విడుదలగుటకు చేయవలసిన సాధన, మోక్షముల గురించి తెలిసికొనుట మొదలగునవి చేయనిచో అతని జన్మ సార్థకము కాదు. సరియైన గురువుని నిర్ణయించుకొని, చేరి, తాను కూడా సరియైనశిష్యుడుగా నుంటేగాని తాను ముక్తుడు కాలేడు.

**దుర్లభం మానుష దేహం** కనుక మానవజన్మ వృథా చేయరాదు. తదుపరి జన్మ పశుపక్ష్యాదులైనచో విచారణకు వీలుపడదు. వికలాంగులైనను, రోగియైనను కుదరదు. అనుకూలమైన వాతావరణము లేకున్నను అనేక సంసారబాధలతో సతమతమగుచున్నను, సాధనకు వీలుపడదు. అందువలన ఈ జన్మలోనే కడతేరవలెను. ఇప్పటికే కాలయాపన జరిగిపోయినది.

**బాల్యమందు బరికింపలేరు**
**యవ్వనంబునందు నరయలేరు**
**ముదిమియందు గూడ మౌనమే కందురు**
**విశ్వదాభిరామ వినురవేమ ॥**

బాల్యమందు ఊహపెరుగలేదు కనుక, మోక్షమార్గమును పరిశీలించలేదు. యౌవ్వనము నందు బుద్ధి పెరిగినది కాని ఇంద్రియ భోగముల కొఱకు ధనార్జన కొఱకు తాపత్రయ పడుటవలన మోక్షమును గురించి ఆలోచించలేదు. వృద్ధాప్యమందు తెలిసినను, దేహము సహకరించ నందువలన వీలుపడలేదు. అయినను సగముకంటే ఎక్కువ జీవితము నిద్రపోవుటలోను, కలలు కనుటలోను వృథాయైపోయినది. ఇంక యెప్పుడు ఈకాలమును సద్వినియోగము చేసికొందురు?

**బాలత్వంబున కొన్నినాళ్ళు, పిదప భామాకుచాలింగనా**
**లోలాభ్యున్నతి గొన్నినాళ్ళు, ముదిమిన్ లోగింటిలో గొన్నినా**
**ళ్ళీ లీలం విహరించితిన్, సుఖఫలంబిందేమియున్ లేదికం**
**జాలు న్నీ పదభక్తి జేసెదను రామా । యార్తి రక్షామణీ ॥**

అని చివరకు వగచి యేమిఫలము? కనుక మనమీజన్మయందే మోక్షమార్గము నవలంబించి, మానవజన్మను సార్థకము జేసికొనెదము గాక!



## 3. గురువు – శిష్యుడు

ఆధ్యాత్మిక బోధ అనేది ఆర్తి కలిగిన శిష్యునికి, సమర్థుడైన గురువు ద్వారా జరిగినప్పుడే ఆ శిష్యునికి తాను ఆశించిన ముక్తి లాభము గల్గుతుంది.

గురువు అనగా ఎవరు? **గుకారో అంధకారశ్చ రుకారో తేజముచ్యతే** గుకారము అంధకారమునకు గుర్తైతే, రుకారము వెలుగునకు సంకేతము. అజ్ఞానమనే చీకటిని జ్ఞానమనే ప్రకాశము చేత పోగొట్ట కలిగిన వాడు గురువు. లఘువు కాని వాడు గురువు. అనగా జ్ఞానములో అంతకంటే గొప్పవాడు ఉండడు. అతడు **కేవలం జ్ఞానమూర్తి** అనగా కేవలము జ్ఞానమే స్వరూపముగా మూర్తీభవించిన వాడు.

**నగురోరధికం** గురువు కంటే అధికులెవరు లేరు. **గురూపదేశము** అంటె, అనుభవజ్ఞుడైనటువంటి గురువు శిష్యుని హృదయ సాన్నిధ్యానికి దైవస్వరూపాన్నందించగలుగుట. అనగా శిష్యుని అజ్ఞానమును పోగొట్టుట.

**అజ్ఞానమూల హరణం, జన్మకర్మ నివారణం**
**జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం, గురుపాదోదకం పిబేత్ ॥**

బ్రహ్మ సాక్షాత్కారమనెడి అనుభవమును గురువు నుండి శిష్యునిలోనికి ప్రవహించుటయే గురుపాద తీర్థము. దీనివలన శిష్యునిలో జ్ఞానము, వైరాగ్యము కలుగును. అజ్ఞానము తన మూలముతోసహా హరించిపోవును. అందువలన జన్మ కర్మ అనే చక్రమునుండి విడుదలై ముక్తుడగును. **సంసార సాగర సముద్ధరణైక మంత్రం** గురువు ఉపదేశించిన మంత్రము వలన సంసారమనే సముద్రమును అవలీలగా దాటగలరు. అందువలన గురువునకు శరణాగతి చేయవలెను.

**కర్మణా మనసా వాచా నిత్యమారాధనం కురు**

**దీర్ఘదండం నమస్కృత్య నిర్లజ్జో గురు సన్నిధౌ ॥**

రాజైనా, ధనవంతుడైనా సరే, శిష్యుడైనప్పుడు మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా, గురువునకు సాష్టాంగ నమస్కారము చేయవలెను. సిగ్గు గాని గర్వము కాని పనికి రాదు.

**శరీరమింద్రియం ప్రాణ మర్థ స్వజన బాంధవాన్**

**ఆత్మ దారాదికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్ ॥**

దేహము, ఇంద్రియములు, ప్రాణము, ధనము, తన సహోదరులు మొదలగు బంధువులతో సహా అన్నీ వదిలి సద్గురువు చూపించిన మార్గములో నడచుకొనుటకు సిద్ధపడి, శరణాగతి చేయువలెను. శ్రీమత్ రాఘవేంద్రస్వాములవారు వారియొక్క గురువాజ్ఞానుసారము తన భార్యను త్యజించి పీఠమును స్వీకరించెను. అప్పుడు వారి భార్య ఆత్మహత్యకు పాల్పడినది లోకవిదితమే. అటులనే శిష్యులు తమగురువులకు శరణాగతి చేయవలెను.

**అనన్యాశ్చింతయంతో మాం సులభం పరమం పదం**

**తస్మాత్ సర్వ ప్రయత్నేన గురోరారాధనం కురు ॥**

ఇతర చింతలు మాని, హృదయ పూర్వకముగా గురువునే ఆరాధించవలెను. అప్పుడే మోక్ష ప్రాప్తి సులభముగా జరుగును.

**గురుధ్యానాత్పరం నాన్యం సత్యం సత్యం నసంశయః ॥**

గురు ధ్యానం తప్ప గత్యంతరం లేదు. ఎందుకంటే గురువే సాక్షాత్ పరబ్రహ్మ గనుక. ఇక సంశయముండనక్కర లేదు. గురువు కావాలా? లేక దేవుడు కావాలా? అని అడిగితే గురువే కావాలని పెద్దలు చెప్తారు. ఎందుకంటే, నీవే భగవంతుడు. నీ కంటే వేరే లేదు. అట్టి జ్ఞానము గురువు ద్వారా



లభిస్తుంది కనుక దైవము లక్ష్యమైతే, గురువు మార్గము.

**ధ్యానమూలం గురోర్మూర్తిః, పూజామూలం గురోఃపదం**

**మంత్రమూలం గురోర్వాక్యం, మోక్షమూలం గురోః కృపా ॥**

అందువలన ధ్యానించవలసినది గురుమూర్తినే. పూజ అతనికే. గురువు అందించే సూచన వాక్యమే గురు మంత్రము. గురుకృపచేతనే లక్ష్యము నెఱవేరును. అందువలన గురువునే ధారణ చేయవలెను. గురువునే భజించవలెను. గురువునే స్మరించవలెను. గురువుకే నమస్కరించవలెను.

**శ్రీమత్పరం బ్రహ్మ గురుం ధరామి,**

**శ్రీమత్పరం బ్రహ్మ గురుం భజామి ।**

**శ్రీమత్పరం బ్రహ్మ గురుం స్మరామి,**

**శ్రీమత్పరం బ్రహ్మ గురుం నమామి ॥**

సమర్థుడైన గురువు శిష్యుని ఉద్ధరించగలడు. అట్టి గురువును కనుగొనుట ఎట్లు? ఇంతగా శరణాగతి పొందినప్పుడు గురువు అనుభవజ్ఞుడు కానిచో, మోసపోయెదరు. అయినను గురువును అంచనా వేయగల శక్తి శిష్యునికి కలదా? అయినను ఏ గురువు సాన్నిధ్యమందు చిత్తశాంతి కల్గునో, అడగకనే సంశయములు తీరునో, అట్టివాడే విహిత గురువని యెంచుకొనవచ్చును. కొంతకాలము గురుబోధ వినిన పిమ్మట, అతనిని వదలుటయా? లేక స్వీకరించుటయా ? అని తేల్చుకొనవలెను. ఒకసారి గురువును స్వీకరించిన పిదప, త్రికరణ శుద్ధిగా గురువునకు లోబడవలెను. గురువుపై పూర్ణవిశ్వాస ముంచవలెను. సమర్థరామదాసు అడిగినంతనే ఛత్రపతి శివాజి పులిపాలు తెచ్చియిచ్చి తనకున్న విశ్వాసమును నిరూపించుకొనెను.

**హఫీజ్ సూక్తులు**

1. ఎందుకు? ఏమిటి? అను ప్రశ్నలు లేకుండా అదృష్టవంతుడగు బానిసవలె

నీ గురువు యొక్క ఆజ్ఞను పాలింపుము.

2. గురువు నుండి నీవు విన్నదానిని ఎన్నడును తప్పు అనకుము. ఏలయనగా గురువును అర్థము చేసికొనలేని నీ అసమర్థత యందే ఆలోపమున్నది.

3. అజ్ఞాన బంధమునుండి నన్ను విముక్తుని చేసిన నా గురువునకు నేను బానిసను. నా గురువేమి చేసినను, తత్సంబంధీకులందరకు అది అత్యంత ప్రయోజనకారి యగును.

కాని ముందుగా విహిత గురువునెంచుకొనుటలో అష్టవిధగురువులున్నారని తెలిసికొని, అజ్ఞానమునుండి విడిపించగల సమర్థగురువుని గుర్తించవలెను.

**అష్టవిధ గురువులు**

(1) బోధక గురువు:- వేదాంత శాస్త్రముల యందలి వాటి శబ్దార్థములను చక్కగా వివరించును.

(2) వేదక గురువు:- శాస్త్రార్థమునే గాక తత్త్వమును కూడా చక్కగా బోధించును.

(3) వాచక గురువు:- శరీర ప్రాణ ఇంద్రియ మనోబుద్ధులెట్లేర్పడినవో మరియు అవి ఎట్లు వ్యవహరించునో చెప్పి, శిష్యుని నిర్విషయము గావించును. శిష్యుని మనస్సును ఆత్మానుభవము వైపునకు మరలించును.

(4) సూచక గురువు:- వేదాంత శాస్త్ర అంతరార్థము తెలిపి జ్ఞానము కల్గించును. తద్ద్వారా ఇంద్రియ నిగ్రహమును కలిగించును.

(5) కారణ గురువు:- **నీవే బ్రహ్మవు** అని తెలిపెడి మహావాక్యములను బోధించి, జీవన్ముక్తియనుభవమును ప్రాప్తింపజేయును.



(6) విహిత గురువు:- శిష్యుని సకల సందేహములను తీర్చి, విదేహ ముక్తుని చేయును. కైవల్య సిద్ధి ప్రాప్తింప జేయును.

ఈ ఆరువిధములైన గురువులకేమిచ్చి ఋణము తీర్చుకొనగలము? పైగా గురువు పరిపూర్ణము గనుక, అతనికి ఏమియు అవసరముండదు. బోధపూర్తైన పిదప, శ్రీకృష్ణమూర్తి గురుదక్షిణగా సాందీపగురు దంపతులకు వారియొక్క ఎప్పుడో చనిపోయిన కుమారుని జీవితునిగా రప్పించెను. దీనికొఱకు యముని ప్రార్థించి ఒప్పించెను. మనమైతే గురువాజ్ఞను పాటించి, మనమివ్వగలిగినది గురువు కోరితే వెంటనే ఇచ్చుటకు సంసిద్ధులము కావలెను. తాను గురువై తనంతటివాడిని మరొక శిష్యుని తయారుచేయుట వల్లనే తన గురు ఋణము తీర్చుకొనుటకు ఉపాయము కలదు. కాని మరియొక మార్గము లేదు.

(7) కామ్యక గురువు:- పుణ్యకర్మలు, యజ్ఞయాగాదులు చేయించి, ఇహ పర సుఖములు కల్గునట్లు చేయును. కోరికలు తీరుచుండగా అవి మరింత వృద్ధి చెంది శిష్యుడు మోక్షమునకు దూరమగుచుండును.

(8) నిషిద్ధ గురువు:- ఆకర్షణ, వశీకరణ వంటి మంత్రములను నేర్పి, ఇహలోక సుఖములను అక్రమముగానైనను పొందునట్లు చేయును. ఇది మోక్షమార్గముగాక తిరోగమనమే.

క్రమముగా బోధక, వేదక గురువులను ఉపయోగించుకొని శిష్యుని సాధనాస్థితి ననుసరించి, వాచక, సూచక, విహిత గురువులను చేరవచ్చును. కామ్యక, నిషిద్ధ గురువుల చెంత చేరరాదు. గురువు ధనకాంక్ష చేతగాని, పుత్రకాంక్ష చేతగాని, మిత్రకాంక్ష చేతగాని బోధించరాదు. శిష్యునియొక్క తీవ్రమోక్షేచ్ఛ ననుసరించి, స్వీకరించి, తరింపజేయవలెను.

అస్త్ర, శస్త్ర విద్యలకు ఆంక్షలున్నవిగాని, ఆత్మవిద్యకు మాత్రము శిష్యుని ఆర్తియే ప్రధానము.

పూర్ణగురువులైతే రెండు రకాలు. (1) నేరుగా సత్యము నుండి వచ్చి జన్మతః గురువవుతాడు. (2) ముందుగా శిష్యుడై, సాధన, అభ్యాసము వలన గురువు అవుతాడు. నిజమైన గురువు శిష్యులపై భారము మోపడు. అతడు బోధగురువే కాని బాధగురువుకాదు. గురునానక్ స్వయముగా వ్యవసాయము చేస్తూ, సమాజానికి ఉచితసేవలందించారు. కబీరుసాహెబ్ బట్టలునేసి తన కుటుంబాన్ని పోషించుకొనేవాడు. రవిదాసు మహాత్ముని గురువు రాజా పీపా మరియు అతని శిష్యురాలు మేవాడ్ రాణియైన మీరాబాయి. అయినను, చెప్పులుకుట్టి జీవించేవాడు. ఒకనాడు మీరాబాయి బంధువులు ఆమెను "నీవేమో రాణివై భవనాల్లో నివసిస్తూ ఉంటే, నీ గురువు చెప్పులుకుట్టేపని చేస్తున్నాడు" అని హేళనచేయగా ఆమె తన గురువైన రవిదాసుకు ఒక వజ్రాన్నిచ్చి, దానిని అమ్ముకొని, మంచిభవనంలో జీవించమని వేడుకొనగా ఆ మహాత్ముడు నిరాకరించెను. కనుక ఏ గురువైతే శిష్యునేమీ కోరడో మరియు ఉచితసేవ చేయునో, ఆ గురువునే ఆశ్రయించవలెను. ఇతరులను ఆశ్రయించి మోసపోరాదు.

అదే ప్రకారము శిష్యుడు ఎట్టి అరమరికలు లేకుండా, కాపట్యము లేకుండా, దాపరికము లేకుండా యుండవలెను. సత్యకాము డనువాడు తనతల్లి చెప్పినట్లు తన తండ్రి యెవరో తెలియదని నిజము చెప్పగా, అతని నిష్కాపట్యమునకు మెచ్చి గురువతనిని శిష్యునిగా స్వీకరించెను. గురువుపై విశ్వాసము, భక్తి, వినయము, విధేయత లుండవలెను. సూక్ష్మబుద్ధితో గ్రహించి, జ్ఞాపకముంచుకొను నేర్పు, విన్నదానిని మరింత విమర్శించుకొని, జ్ఞానమును పెంచుకొను వివేకము,



తిరిగి ఇంకొకరికి బోధించగల పాండిత్యము మొదలగునవి శిష్యునికి అవశ్యము. ఆషాడభూతి వంటి శిష్యులు వారిని వారే మోసగించుకొందురు.

గురువు సమ్మతించకపోయినను శిష్యుడు ఆ గురువు యొక్క ప్రతిమరూపమును గురువుగా పెట్టుకొని విలువిద్య నేర్చిన ఏకలవ్యుడు కలడు. అనగా శిష్యుని ఆర్తియే ఇక్కడ ప్రధానము.

**అష్టవిధ శిష్యులు**

(1) లక్కపాక శిష్యుడు :- అగ్ని వలన కరిగిన లక్క అగ్ని దూరమవగానే గట్టిపడును. శిష్యుడు గురుబోధ విన్నంతసేపు పులకించి పోవును. గురుబోధ లేనప్పుడు అంతయు మరచిపోవును. ఇట్టి శిష్యుని లక్కపాక శిష్యుడందురు.
(2) చర్మపాక శిష్యుడు :- వైద్యుడు సూదిమందు ఇచ్చునప్పుడు చర్మముపై రంధ్రముచేయును. సూది తీసివేయగానే రంధ్రము పూడును. అట్లే శిష్యుడు బోధ విన్న వెంటనే మరచిపోవును. క్షణముకూడా బోధను నిలుపుకొనడు.
(3) దారుపాక శిష్యుడు :- కొయ్యకు చేసిన రంధ్రము పెరుగదు, తరుగదు. అటులనే శిష్యుడు తాను విన్నదానిని ఉంచుకొనును. మరచిపోడు, పెంచుకొనడు.

(4) వస్త్రపాక శిష్యుడు :- నీటిలో ముంచిన వస్త్రము నీటిని బాగుగా పీల్చును. పిండినప్పుడు మరియు ఆరబెట్టినప్పుడు నీటిని వదిలివేయును. శిష్యుడుకూడా అట్లే బోధను బాగుగానే స్వీకరించియు, విడచిపెట్టుచుండును.
(5) ఉక్కుపాక శిష్యుడు :- నీటితో తడిసిన ఇనుము నీటిని పీల్చదు, కాని తుప్పుపట్టి చెడిపోవును. శిష్యుడు గురుబోధను నిల్పుకొనడు. కాని 'తా చెడ్డ కోతి వనమెల్ల చెరచు' అన్న విధముగా, తోటి శిష్యులను చెడగొట్టును.
(6) ఉప్పుపాక శిష్యుడు :- నీటిలో వేసిన ఉప్పు కరిగిపోయినట్లు, గురుబోధను శిష్యుడు తనయందు జీర్ణించుకొని తన మనస్సును వేదాంత

కార్యార్థమందు లయము చేసికొనును.

(7) శిలాపాక శిష్యుడు :– నీటిని పీల్చజాలని శిలవలె, గురుబోధను శిష్యుడేమాత్రము గ్రహింపలేడు. బోర్లించిన కుండపై నీరుపోసినచో, కుండ నిండదు, పైగా నీరు వృథాయగును. అనగా గురుబోధవృథాయగును.

(8) తైలపాక శిష్యుడు:– నీటితో నిండిన పాత్రలో ఒక నూనెచుక్కను వేసినచో, ఆనూనె పాత్రలోని నీటిపై తేలుచు, అంతటను వ్యాపించునట్లు, శిష్యుడు గురువు అందించిన బోధను విస్తరింపజేయును.

వీరిలో ఉప్పుపాక, తైలపాక శిష్యులుత్తములు. కొందరు శిష్యులు గురువుల ఫోటోలు గోడలనిండా నింపుకొంటారు. కొందరు గురువుల బోధలను తమ హృదయములనిండా నింపుకొంటారు. వీరిలో రెండవరకము వారే గురుకృపకు పాత్రులు. ఎవరికివారు చదువుకోవచ్చునుగాని, తగిన సమయంలో గురువుద్వారా బోధవిన్నగాని జ్ఞాని కాలేడు. ఒక వృద్ధుడు చాలా కాలం నుండి శాస్త్రాలు వల్లె వేస్తూ ఉంటే, శ్రీ శంకరాచార్యులవారు అతనిపై కృపచూపగా అతడు తరించెను. అప్పుడు చెప్పినవే శ్రీ శంకరుని భజగోవిందం శ్లోకాలు.



## 4. శ్రవణం – మననం – నిధిధ్యాస.

గురుబోధను స్వీకరించిన శిష్యులు వారి మనస్సులో ఆ విన్నదానిని మననం చేసి, బుద్ధిలో స్థిరము చేయవలసి యున్నది. అందువలన అవసరమైనప్పుడు అనుభవమును రూఢి చేసికొనగలరు. ఈ ప్రక్రియలో శ్రవణ, మనన, నిధిధ్యాసనలను శిష్యులాచరించవలెను.

**శ్రవణము** :– సావధానముగా వినుట శ్రవణ మనబడును. సావధానమనగా జడత్వము, మూర్ఖత్వము లేకుండుట, శాంతిగా నుండి వినుట, విన్నదానిని నిష్పక్షపాతముగా స్వీకరించుట. తమోగుణస్థుడు విన్నదానిని గ్రహించలేడు. అనగా అసంభావన చేయును. రజోగుణస్థుడు అపార్థము చేసికొనును. అనగా విపరీతభావన చేయును. సత్త్వగుణము ప్రధానముగా నున్నవాడు విన్నది విన్నట్లు గురువు యొక్క భావమును పూర్తిగా గ్రహించును. అనగా సంభావించును. సత్వగుణ ప్రధానముగా నున్న శిష్యునికే జ్ఞానము అబ్బును. **సత్వాత్ సంజాయతే జ్ఞానం.** పరీక్షిన్మహారాజు తీవ్రమోక్షేచ్ఛతో సత్వగుణ ప్రధానముగానుండి శుకుని వద్ద మహాభాగవత శ్రవణము చేసి ఏడు రోజులలో ముక్తి బడసెను.

**వాసనాత్రయము** :– దేహము నేననెడి వాసన దేహవాసన. లోకముతో సంబంధపడి యుండుట లోకవాసన. పుట్టినప్పటి నుండి వారసత్వముగా లేక ఇతరుల నుండి గ్రహించిన భగవద్విషయములను నమ్మి, విచారించకయే ఒక అభిప్రాయము కలిగియుండుట శాస్త్రవాసన. ఈ మూడింటిని వాసనాత్రయమందురు. శ్రవణము చేయువాడు ఈ మూడు వాసనలనుండి దూరముగా నుండవలెను. గురుబోధ విన్నప్పుడు శిష్యుని పూర్వశాస్త్ర జ్ఞానము సరిదిద్దబడును. సందేహమున్నచో వినయముగా గురువుని పరిప్రశ్నచేసి తీర్చుకొనవలెను. అంతేకాని శిష్యునికి తెలిసిన

దానిని శ్రవణమునకు అడ్డుపడనీయరాదు. అనగా మనస్సును ఖాళీచేసికొని వినవలెను.

**అద్వైతామృతధార కురియ,**
**అంతరంగమనెడి పాత్ర తెరచి ఉంచు**
**బోర్లించి ఉండగా బొట్టైన చిక్కదు**
**తెరచి ఉంచిన చాలు తరచనగును ॥**

ఆత్మబోధయనెడి అమృతము గురువు నుండి స్రవించునపుడు, శిష్యుని మనసు బోర్లించిన కుండవలె కాక తెరచియుంచుకొనవలెను. వాసనాత్రయమును ఖాళీచేసి యుంచుకొనవలెను. స్వాతి వానచినుకు కొఱకు చకోరపక్షి నిరీక్షించు మాదిరి ఆత్మబోధకై శిష్యుడు ఆసక్తితో ఎదురుచూడవలెను. పిమ్మట విన్నదానితో తనకున్న జ్ఞానమును సరిచూచు కొనవలెను.

**మననము** :– గురు ముఖతః విన్నది శ్రవణము. అప్పుడు శిష్యునికి తనకున్న తెలివి, శక్తి కంటె ఎక్కువగా గురువునుండి అందింపబడును. కొంతతడవైన పిదప శిష్యునికి అదనముగా అందింపబడిన తెలివి తొలగిపోవును. అందువలన విన్నదానిని వెంటనే మననము చేసి జ్ఞాపకముంచుకొనవలెను. మధ్యలో వేరే విషయములను చొరబడనీయరాదు. అప్పుడు గురుబోధ తరిగిపోకుండా నిలచును. విన్నవెంటనే అర్థముకాకపోయినను మననము వలన తేటతెల్లమగును.

**తచ్చింతనం తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనమ్ ।**
**ఏతదేక పరత్వంచ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః ॥**

శ్రవణము తరువాత మననమనగా, గురబోధసారమైన ఆత్మను లేక బ్రహ్మమును గురించియే ఆలోచించవలెను. దాన్ని గురించియే



మాట్లాడవలెను. శిష్యులు వారిలో వారు దానినే చర్చించు కొనవలెను. అదొక్కటే పరమలక్ష్యముగా ఉండవలెను. ఇలా కొనసాగుటనే బ్రహ్మాభ్యాసము అందురు.

**నిధిధ్యాస** :– విన్నబోధ మననము ద్వారా బుద్ధిలో స్థిరముకాగా మనన మాగిపోవును. దీనినే నిధిధ్యాస యందురు. నిధిధ్యాసలో చేరినది ఎప్పుడో ఒకప్పుడు అనుభవపూర్వకముగా తెలియబడును మరియు స్పష్టమగును. అంతవరకు స్మృతిలో చేరినబోధను నిధిధ్యాసయందురు. మననమందు సాగిన బ్రహ్మాభ్యాసము బ్రహ్మచింతనగా మారుటయే నిధిధ్యాసము. నేను స్త్రీ లేక పురుషుడు అని ఎట్లు మననము చేయకనే, లేక జ్ఞాపకము పెట్టుకొనకనే నిర్ణయమై యుందురో, అటులనే శిష్యులు తనయొక్క బ్రహ్మభావము నిర్ణయమై యుండుటయే నిధిధ్యాస.

## 5. నేను ఎవరు?

**స్వం ఆత్మ విషయకం అధ్యయనం స్వాధ్యాయః** "నేను ఎవరు?" అని విచారించుటయే స్వాధ్యాయము.

**నేననగా మేనుగానని**
**మానసమున నెఱుగకున్న, మనుజుల కెల్లన్ ।**
**స్వానుభవ సిద్ధి దొఱకదు,**
**తానగు పరమాత్మ నెఱుగ దరమా వేమా ॥**

నేననునది శరీరము కాదనియు, ఆత్మప్రకాశమువలన **నేను** కలిగినదనియు ఎవరు తెలిసికొనునో, అతడే ఆత్మానుభవము నొందును. శరీరమే నేననుకొనువానికి తన స్వరూపజ్ఞానము సిద్ధించదు. అతడు **తానే పరమాత్మయైనట్టి** అనుభవమును ఎన్నటికి పొందలేడు.

మానవునికి బయట నామరూపముగా కనిపించేది స్థూలదేహము. కాని అవయవాలకు నేనను జ్ఞానము లేదు. పునర్జన్మలకు కారణమైన సూక్ష్మదేహము అనేక అనుభవములను పొందుచున్నది. వాటిని వాసనారూపముగా నుంచుకొని, మరొకజన్మలో మరలా అనుభవించు చున్నది. శరీరము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు యివి అన్నియు తన బుద్ధిలో తోచే **నేను**ను ఆధారము చేసికొని పనిచేయుచున్నవి. **నేను**లో నున్న చైతన్యమే ఆత్మచైతన్యము. జడమైన దేహేంద్రియ ప్రాణమనస్సు లన్నియు కలిపి అనాత్మయందురు. ఇవి ఆత్మచైతన్యము వలన చేతనత్వము నొంది వ్యవహరించుచున్నవి. అవి స్వయముగా **నేను** అనెడి చైతన్యము కాదు. విచారణచేయగా నా శరీరము, నా ప్రాణము, నా మనస్సు అని, వీటిని నా కంటే వేరైనట్లుగానే మాట్లాడుచున్నాము. అనగా చైతన్యాత్మ వేరు, జడమైన అనాత్మ వేరని తెలియుచున్నది. ఆత్మ, అనాత్మ, యీ రెండును



**నేను** అనెడి ప్రత్యయముతో కలిసిపోయి ఉన్నవి. ఋషులు, మునులు యీ మానవదేహాన్ని నరనారాయణులని వర్ణించారు. అనగా ఇందులో అనాత్మ, ఆత్మ కలిసి ఉన్నాయని అర్థము. అలాగే **దేహో దేవాలయప్రోక్తో, జీవో దేవో సనాతనః** అనగా దేహమనేది దేవాలయమైతే, అందులోని జీవుడే ఆది అంతములేని దేవుడు. బైబిల్‌లో కూడా యిలా ఉన్నది. దేహమనే వస్త్రమువిడచి, ఒకడు దిగంబరాత్మయైతేగాని, తండ్రియొద్దకు చేరనేరడు. అనగా దేహమునేనను భావనవిడచి, తాను కేవలము ఆత్మను అని నిశ్చయమైనవాడే పరమాత్మ స్వరూపుడగును. కాని ఆత్మానాత్మలు కలిసిపోయి కలగాపులగ మయినవి. ఈ రెండిటిని వేరు చేసి, నేను ఆత్మను, నేను అనాత్మను కాను అని విమర్శించుకొనవలసియున్నది. ఆత్మానాత్మలు కలసిపోయినది పచ్చి చింతకాయవంటిదైతే, ఆత్మానాత్మలను విడదీసి, ఆత్మనేనను విచారణను గుల్లచింతకాయతో పోల్చవచ్చును. గుల్లను, పీచును, గింజను తీసివేసి చింతపండు అనెడి ఆత్మను మిగుల్చుటయే ఆత్మానాత్మ వివేకము. పచ్చిచింతకాయలో ఆవిధముగా వేరు చేయలేము. అప్పుడది అజ్ఞానము.

ఆత్మను గుర్తించకపోగా అనాత్మను నేననెడిది అజ్ఞానము. అప్పుడు **నేను** అనెడిది జీవాత్మ. **నేను**ను ఆత్మగా గుర్తించి, అనాత్మ **నేను** కాదని గట్టిగా నిర్ణయిస్తే ఆత్మానుభవము కల్గును. అప్పుడు **నేను** అనెడిది ప్రత్యగాత్మయగును. ఇది జ్ఞానము. అనాత్మలో ఆత్మ యెట్లున్నదో ఈ గ్రంథము యొక్క ముఖచిత్రమును పరిశీలించుము.

ఒక వడ్రంగివద్ద గంధపు కఱ్ఱయున్నది. అది తన వద్ద నిరుపయోగముగా నున్నది. అతనియొక్క స్నేహితుడు శిల్పము చెక్కగలడు. ఒకరోజున, ఆశిల్పి గంధపు చెక్కను కృష్ణుని బొమ్మగా చెక్కెను. బొమ్మ

ఎలా తయారైనది? ఆ చెక్కయందు కృష్ణునికి కావలసిన పదార్థమును పోకుండా ఉంచి, మిగిలిన దానిని కొద్ది కొద్దిగా చెక్కి, వేరు చేసెను. అక్కరలేనిది తీసివేయగా, మిగిలినది అందమైన కృష్ణునిబొమ్మ. అదే విధముగా ఆత్మానాత్మలనుండి అనాత్మను తీసివేయగా ప్రత్యగాత్మయనెడి జ్ఞానము మిగిలినది. ఆ విధముగా తీసివేయక మునుపు కూడా ఆ గంధపు చెక్కలో కృష్ణ విగ్రహమున్నది. కాని అది తెలియబడలేదు. ఇదే అజ్ఞానము. కఱ్ఱగా భావించడమే జీవాత్మ మరియు కృష్ణునిగా భావించుటయే ప్రత్యగాత్మానుభవము. అందువలన **నేను** ఎప్పటికిని మారని ఆత్మ పదార్థమా? లేక మార్పుచెందే అనాత్మ పదార్థమా? యని విమర్శించవలెను.

**నేను** మారకుండానే, **నేను**కు చెందిన శరీరము బాల్య యౌవ్వన వృద్ధాప్యములుగా మారుచున్నది. **నేను** ఒక్కతీరుగానే యున్నది, కాని అనుభవములో బాల్యము, యౌవ్వనము, వృద్ధాప్యము భిన్నముగా నున్నవి. **నేను**ను ఆధారము చేసికొనియే మెలకువ, కల, గాఢనిద్రానుభవము లనెడి అవస్థలు జరుగుచున్నవి. నిజానికి **నేను**కు అవస్థలు లేవు. కాని మనసుకు అవస్థలున్నవి. నేనుకు మరణము లేదు, కాని స్థూలశరీరమునకు మరణమున్నది. ముక్తి లభించినప్పుడు సూక్ష్మశరీరము భంగమగుచున్నది. జన్మలకు కారణమైన వాసనలను కారణశరీర మనుచున్నాము. వాసనలు 'సున్న' అయినప్పుడు కారణ శరీరము నశించి ఆత్మ మిగులుచున్నది. అందువలన ఆత్మ నిత్యము, సత్యము, కాని స్థూల సూక్ష్మ కారణ శరీరాలు అనిత్యము మరియు నశించుచున్నవి. **శీరియతే ఇతి శరీరః** ఏది క్షీణించి నశించునో అది శరీరము. కనుక పై మూడు శరీరములు నశించేవే. **నేను** ఆత్మయొక్క అభివ్యక్తము. ఆత్మప్రకాశముయొక్క ప్రతిబింబమే **నేను** అనెడి స్ఫురణ.



కనుక శరీరములు నేను అనుట అజ్ఞానమగును. **నేను**ను ఆత్మగా తెలుసుకొనుటయే జ్ఞానము. **నేను**ను, శరీరములను విడమరచి తెలిసికొనుటయే **నేనుఎవరు**? అను విచారణ మరియు ఫలితముగా ఆత్మానుభవము.

**ఆత్మదేహమందు సూక్ష్మమునను జూచి**
**దేహమాత్మయందు తేటపఱచి**
**యాత్మయందె చూడ నతడెపో ఘనయోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ॥**

**నేనుఎవరు**? అని విచారించి, తన దేహమందు ఆత్మనెఱిగి, తానాత్మనేగాని యింకేమియుగాదని, నిరంతరము ఆత్మానుభవములో నుండిపోవుటయే యోగము. ఇట్టియోగి శరీరముతానుకాదను భావముతోనుండును. ఆత్మభావములోనుండి కర్మచేయువారికి కర్మయంటదు. ఎట్లనగా చేతికి నూనెరాసుకొని పనసతొనలు ఒలిస్తే పనసజిగురు అంటదు. ఆవిధముగా ఆత్మభావనతో నున్నవానికి కర్మయంటదు. దేహమే తానను అనాత్మభావన యున్నవానికి కర్మవాసనలేర్పడి పునర్జన్మలనొందును. అందువలన శరీరములు నేనుకాదు అనుటకు శరీరములను విమర్శించవలసియున్నది. అందుకొఱకే భగవాన్ శ్రీ రమణులు **నేనుఎవరు?** అనేదానిని తెలిసికొనమని పదేపదే చెప్పేవారు.

## 6. శరీరత్రయ విచారణ

**స్థూలశరీరము** :– కళ్ళకు కనపడేదానిని స్థూలశరీరమనియు, అది నశించు స్వభావము గలది కనుక, శరీరమనియు, మానవుని అవయవములతో కూడిన రూపనామ శరీరమును స్థూలశరీరమనుచున్నాము. ఇది పంచభూతములనుండి ఏర్పడినది. దీనిలో రక్తము, మాంసము, ఎముకలు, మూలిగ, కీళ్ళు, రసాలు, రసాయనాలు, గ్రంథులు, నాడులు, చర్మము, మెదడు, క్రొవ్వు, వెంట్రుకలు, గోళ్ళు మొదలగునవి గలవు. ఇది తల్లిదండ్రుల వలన కలిగిన శోణితము, శుక్లముల కలయికతో తల్లి గర్భమునందు పిండమై వెలుపలికి వచ్చునప్పుడు పుట్టుక అని పిలువబడుచున్నది. ఇది అన్నము వలన కలిగి, అన్నము చేత పోషింపబడుచు, అన్నము లేనిచో క్షీణించి నశించుచున్నది. ఉండుట, పుట్టుట, పెరుగుట, మార్పుచెందుట, క్షీణించుట, నశించుటయను షడ్విధ వికారములు చెందునది యీ స్థూలశరీరము. సూక్ష్మశరీరము నుండి వేరైన స్థూలశరీరమునకే మరణమని పేరు. సూక్ష్మశరీరము మరియొక స్థూలశరీరమును సంపాదించుటను జననమందురు. పంచభూతముల చేరికతో తయారైన స్థూలశరీరము మరణించిన పిదప తిరిగి పంచభూతములలో కలసిపోవును. సూక్ష్మ శరీరము అనేక స్థూల శరీరములను నిర్మించుకొని, జీవించి, మరలా వదలు చుండును. దీనిని పునర్జన్మలందురు. ఈ సూక్ష్మశరీరముకూడా పోవునట్లు చేసినచో అదే జననమరణరాహిత్యము. ఈ స్థూలశరీరము నవరంధ్రము లతో గూడి, చర్మమను సంచిలో పడి, యొక రూపమును ధరించి, అదే దాని యందమనుకొనును. దానికి ఆభరణములు తొడిగి ఆనందించును.

**తొమ్మిది కంతల తిత్తికి**
**ఇమ్మగు సొమ్ములును, కులుకు లేటికి చెపుమా !**



**నమ్మకు దేహము నాదని,**
**బ్రహ్మము నేననుచు తెలిసి పలుకుర వేమా ॥**

ఇట్టి దేహమునేనని నమ్మి జన్మలందు తిరుగకుము. సోకులు, ఆర్భాటము లెందుకు? నేను బ్రహ్మము అని తెలిసి, అట్లే **అహంబ్రహ్మ**యని అనుము. అదే దుఃఖనివృత్తి లేక మోక్షము. ఇదియే **నేనుఎవరు**? అనుదానికి సమాధానము.

**సూక్ష్మశరీరము** :– 19 తత్త్వములతో కూడినది సూక్ష్మశరీరము. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమను అంతఃకరణ చతుష్టయము, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనెఱుగు చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కుల యందున్న పంచజ్ఞానేంద్రియములు, కర్మ చేయుటకు ఉపయోగపడు వాక్కు, కాళ్ళు, చేతులు, ఉపస్తు, పాయువనెడి పంచకర్మేంద్రియములు ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానములనెడి పంచప్రాణములు వెరసి 19 ఇంద్రియములను సూక్ష్మశరీరమందురు.

కర్మచేసేది, కర్మ అనుభవించేది సూక్ష్మశరీరమే. స్థూలశరీరముకాదు. స్థూలశరీరము పనిముట్టు మాత్రమే. కన్ను, చెవులు, ముక్కు, నాలుక, చర్మము మొదలగునవి స్థూల శరీరములో అమర్చబడి యున్నవి. ఇవి రక్తమాంసాలతో కూడిన అవయవములే. వీటి స్థానమందు నిలచి, చక్షురింద్రియము, శ్రోత్రేంద్రియము, ఘ్రాణేంద్రియము, జిహ్వేంద్రియము, త్వగింద్రియము మొదలగు సూక్ష్మ ఇంద్రియములు పనిచేయుచున్నవి. స్థూలశరీర అవయవ నిర్మాణము సూక్ష్మమైన ఇంద్రియములు పనిచేయుటకనుగుణముగా జరిగినది. అటులనే కర్మేంద్రియములుకూడా వాటికి తగిన అవయవము లందు స్థానమేర్పరుచుకొని పనిచేయుచున్నవి. పంచప్రాణములందు కూడా

స్థూలదేహమందు తగినచోట్ల నందుండి వాటివాటి క్రియలు జరుపుచున్నవి. ప్రాణములేని మనసు పనిచేయదు. మనసు లేకుండా ప్రాణమున్నప్పటికిని అనుభవముండదు. ప్రాణము లేని స్థూలశరీరము శవమే. ఈ విధముగా సూక్ష్మదేహమనగా అనుభవములను గ్రహించి, స్మృతి యందుంచుకొనుట మరియు కర్మవాసనలను ధరించి యుండుట. మరొకసారి పాతకర్మవాసనల వలన అనుభవమునొందుట మరియు క్రొత్త కర్మవాసనలను ఏర్పరచు కొనుట. ఇందలి వాసనలకు సూక్ష్మశరీరము ఆధారమే గాని, వాసనలు వేరుగా నున్నవి. ఈ వాసనలనే కారణశరీరమందురు.

**కారణ శరీరము** :- కారణశరీరమనగా సంచిత కర్మవాసనలు. వీటి కారణముగా జన్మలు కలుగుచున్నవి. అనగా స్థూలదేహమేర్పడుచున్నది. సూక్ష్మదేహము ద్వారా కర్మలు అనుభవములగుచున్నవి. మరలా కర్మలు చేయుట కూడా యీ సూక్ష్మ దేహము వల్లనే జరుగుచున్నది. అందువలన సంచితరాశి తరుగుటలేదు. అందువలన పునర్జన్మ నొందుచున్నాము. పాతకర్మ అనుభవింపబడగా ఖర్చైపోయినప్పుడు, కొత్తకర్మ యేర్పడని విధముగా జీవించినప్పుడు, జన్మలకు కారణముగా నున్న వాసనలు సున్నయగును. అప్పుడు సూక్ష్మదేహము విశ్వ ప్రాణశక్తిలో విలీనమగును. స్థూలదేహము యిక యేర్పడదు. ఇదియే జన్మరాహిత్యము. జన్మకు కారణమైన వాసనలనే కారణశరీర మనుచున్నాము. కారణము సున్నయైనప్పుడు ముక్తుడగుచున్నాడు. సాధారణముగా పుట్టినవాడు గిట్టుచున్నాడు, గిట్టినవాడు మరల పుట్టుచున్నాడు. **జాతస్య మరణం ధృవం.** కాని మరణించినవాడు ముక్తుడైతే తిరిగి జన్మించడు.



## 7. పునర్జన్మ

**అనేక జన్మ సంప్రాప్తం ధర్మకర్మ విధాతుమే**
**జ్ఞానబోధ ప్రభావేన తస్మై శ్రీ గురవేనమః ॥**

అనేక జన్మలనుండి వెంటవచ్చుచున్న ధర్మముల మరియు కర్మముల అలవాట్లు, వాసనలు ఎన్ని ఉన్నను, నా గురువు ఈ ఒక్కజన్మలోనే వాటినన్నిటిని తుడిచివేయగలడు. అట్టి గురువునకు నమస్కరించుచున్నాను.

పునర్జన్మయనగా సూక్ష్మశరీరము కొనసాగుచు, స్థూల శరీరములను మరల మరల తెచ్చుకొనుట. **పునరపి జననం పునరపి మరణం** అనగా మళ్ళీ మళ్ళీ పుట్టడం మరియు మళ్ళీ మళ్ళీ చావడం. అజ్ఞానికి జరిగేదింతే. జనన మరణములను తగ్గించుకోవడం ఎలా? అసలు పునర్జన్మలున్నవా? ఎవరికైనను వారు చేసిన పనికి తగిన ఫలితముండును. చేయక పోయినచో ఎట్టి ఫలితముండదు. వ్యవసాయము చేయకపోతే పంటపండదు. ఒక పని చేసినప్పుడు మరొకపనియొక్క ఫలితమురాదు. ఇది అందరికినీ తెలిసినదే. పుణ్యఫలము సుఖము, పాపఫలము దుఃఖము.

ఈ వాదనకు విరుద్ధముగా పుణ్యము చేయువానికి బాధలు, పాపము చేయువానికి సుఖమును చూచుచున్నాము. ఒకానొక ప్రయత్నము ఫలించుటలేదు, కాని అప్రయత్నముగా లాభము కల్గుటయు చూచు చున్నాము. దీనికి సమాధానము దొఱకుట లేదు. పుట్టు గ్రుడ్డి వాడు ఎప్పుడు పాపము చేసెను? ఆగర్భ శ్రీమంతుడెప్పుడు పుణ్యము చేసెను? దీనికి జవాబే పునర్జన్మ సిద్ధాంతము.

**పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేణ, పూర్వజన్మ కృతం పుణ్యం భోగరూపేణ** అందువలన ఒక శరీరముతో చేసిన పాపపుణ్యములు అదే శరీరముతో ననుభవించుటలేదు. మరొక శరీరముతో ననుభవించు

చున్నాడు. అతడెంతటి పాపములీజన్మలో చేసినను, పూర్వజన్మకృతమైన పుణ్య ఫలితమైన సుఖమునే యనుభవించుచున్నాడు. అలాగే, ఎంతటి పుణ్యము చేయుచున్నను, అతడు పూర్వజన్మలో చేసిన పాప ఫలితము నీజన్మలో బాధలుగా ననుభవించుచున్నాడు. భ్రమరము ఒక నెలలో 15రోజులపాటు మకరందమును సంపాదించి దాచుకొనును. తరువాతి 15 రోజులలో ఆ దాచుకొన్న మకరందమును అనుభవించును. అటులనే మానవుడు ఒక జన్మలో కర్మలు చేయును. తరువాతి జన్మలో అనుభవించుచుండును. అందువలన పునర్జన్మలున్నవని నమ్మదగినది.

పురాణేతిహాసములందు పునర్జన్మల ప్రస్తావన గలదు. జమదగ్ని మహర్షి లేడిగా పుట్టెను. వాల్మీకిమహర్షి తులసీదాసుగాను, శుకుడు కబీరుగాను, నారదుడు త్యాగరాజుగాను, వ్యాసులవారు భక్త జయదేవుని గాను జన్మించిరి. అర్జునుడు భక్త కన్నప్పగాను, భీముడు మధ్వాచార్యునిగాను జన్మించిరందురు. గజేంద్రుడు గతజన్మలో రాజుగానుండెను. శంకరాచార్యులు 28 మారులు జన్మించినట్లు చెప్పుచున్నారు. అప్పుడే పుట్టిన పాపలు 3,4 సం॥ల వయస్సులో వారి పూర్వజన్మ సంసారము గురించి చెప్పెడి వార్తలను చూచుచున్నాము. ఎవ్వరూ నేర్పకుండానే, చిన్న వయస్సులో సంగీతము, చదరంగము వంటి వాటిలో ప్రజ్ఞ చూపెడి వారు, వారి పూర్వజన్మయందు వీటిని నేర్చి యుండవలెను. షిరిడి సాయిబాబా వారి మాటలలో కప్ప పాము వైరములు వారి పూర్వజన్మ మానవులుగా నున్నప్పటిదనియు, రెండు బల్లులు కలియుటను వారి పూర్వజన్మలో అక్కాచెల్లెళ్ళనియు గలదు.

క్రిమికీటకాదులు, పశుపక్ష్యాదులు మొదలగు వాని శరీరములు జన్మ జన్మకు మారుటను పరిణామమనియు, మరల మరల



మానవదేహమే లభించుటను పునర్జన్మలనియు అందురు. మానవేతర జీవులయందు ప్రకృతి సిద్ధముగా కలిగే ప్రేరణ వలన అవి ఆకలి నిద్ర భయము, మైథునముల యందు ప్రవర్తించును. దీనికి కారణము వాటి సహజ సంస్కారములు (ఇన్‌స్టింక్ట్). మానవుని పూర్వ కర్మ వాసనలచే ఈ జన్మలో ప్రవర్తించుచు, తన కర్మకు తానే కర్త, భోక్త యని అనుభవించు చుండును. కనుక మానవుని కర్మలో ప్రయత్నము, ఆస్వాదన, జ్ఞాపకము వంటివి ఉన్నవి. బుద్ధిలో విచక్షణ వివేకములుకూడానున్నవి. అతడు చేసేకర్మ ప్రకృతిని తప్పించుకొని, అధిగమించేదిగా కూడా నుండును. అందువలన అతడివి అసహజ సంస్కారములు. కర్మను, కర్మ ఫలితమును తప్పించు కొనగల తెలివి, సామర్థ్యమున్నను, ఆ విధముగా చేయుటలేదు. అందువలన అతడి కర్మకు అతడే బాధ్యుడు. **ఎవరు చేసిన కర్మ వారనుభవించుట ఎవరికైనను తప్పదన్నా !** అని ఒక సినీ కవి గేయము.

కర్మ సిద్ధాంతము, పునర్జన్మ సిద్ధాంతమునెఱిగినవాడు రాబోయే జన్మలలో మరింత సుఖభోగాలుండు లాగున అనేక పుణ్యకార్యములు చేయవచ్చును. స్వర్గలోకానుభవముల కొరకు యజ్ఞయాగాదులు చేయవచ్చును. మంచి భర్త, సంతానము కొఱకు స్త్రీలు చేయు నోములను చూచుచున్నాము. పుత్ర కామేష్టి, అశ్వమేథ వంటి యాగములను పురాణములలో వినియున్నాము. ఇవి యన్నిటి ఫలితములు మరొక దేహము తెచ్చుకొనుట చేతనే అనుభవింపబడును. స్వర్గలోకములో కూడా యజ్ఞఫలము ఖర్చుకాగానే తిరిగి భూలోకములో జన్మించ వలసినదే. **క్షీణే పుణ్యం మర్త్యలోకం విశంతి**. అసలు పునర్జన్మ వద్దే వద్దు, మోక్షము కావాలి అన్నప్పుడు కర్మలు చేయరాదు. కాని కర్మ చేయకుండా క్షణమైనను ఉండలేము గనుక నేను, నాది, నావారు యనెడి స్వార్థమును విడచి నిష్కామ

కర్మ చేయవలసి యున్నది. ఇట్టి కర్మాచరణకు తీవ్రమైన సాధన చేయుచు, చివరకు ఆత్మవిద్యను అభ్యసించి, ఆచరించవలెను. ఈ సాధన గురువు యొక్క పర్యవేక్షణలో జరిగితే లోపములను గుర్తించి, సరిదిద్దుట మరియు గురు సత్తా శిష్యునిలో పనిచేయుట వలన శీఘ్రముగా మోక్షప్రాప్తి కల్గును.



## 7. కర్మలు

**కర్మమును బుట్టు జంతువు**
**కర్మమున వృద్ధిపొందు, కర్మమున జెడున్**
**కర్మము జనులకు దైవము**
**కర్మము సుఖదుఃఖములకు కారణమధిపా ॥**

శ్రీకృష్ణ పరమాత్మ ఇలా చెప్పాడు. ఎవరెవరు చేసిన పాపపుణ్యకర్మలకు తగిన ఫలితమును వారికి పంచియిస్తానని.

పరిణామదశలో, పశుపక్ష్యాదుల సంస్కారాలు కొన్ని ఖర్చై వీలుపడని సంస్కారాల ఫలితముగా మానవ స్వభావమేర్పడి యుండును. అందువలన మనము ఆవు వంటి సాధవులను, కోతివంటి చంచల మనస్కులను, నక్కవంటి కుశ్చితులను, పులివంటి క్రూరులను, కుక్కవంటి విశ్వాసులను మొదలుగాగల అనేక స్వభావములను మానవులయందు చూచుచున్నాము. ఒకప్పుడు మానవులను ద్విపాద పశువులని కొందరి విషయంలో అనుచున్నాము.

ఈ విధముగా గత జన్మలలో అనుభవించగా మిగిలియున్న మొత్తము కర్మలను సంచితకర్మలందురు. క్రొత్తగా ప్రస్తుతజన్మలో చేసిన కర్మను ఆగామికర్మ అందురు. ఇది సంచిత కర్మరాశిలో కలసి, ఆరాశి పెరుగుచుండును. ప్రస్థుత జన్మకు కేటాయించబడిన కర్మను ప్రారబ్ధము అందురు. దీనిని అనుభవించబడుట ద్వారా ఖర్చైనప్పుడు, సంచితరాశి తరుగుచుండును. సంచితకర్మరాశి తరిగి తరిగి సున్న అయినప్పుడే మోక్షము. కాని సంచితము కొన్నివేలజన్మలకు సరిపడాయున్నది. ఈశ్వరుడు ఒక్కొక్కరికి సంచితముల నుండి ప్రారబ్ధమును వేరుచేసి, శరీరమిచ్చు చుండును. ఆ శరీరముతో తన ప్రారబ్ధమును అనుభవింప జేయును.

ప్రారబ్ధమును అనుభవించుట ద్వారా ఖర్చు చేస్తూ, వాటిని తగ్గించుట అసాధ్యము. దీనికి అనేక జన్మలు పట్టును. అందువలన జ్ఞానము కలిగినంతనే సంచితకర్మరాశి నశించును. **జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి.** ఇంతేకాదు జ్ఞానము వలన క్రొత్తకర్మ మరి యేర్పడదు.

**ప్రారబ్ధం బోగతో నశ్యతే తత్త్వ జ్ఞానేన సంచితః**

**ఆగామి ద్వివిధం కర్మత ద్వేషీ ప్రియవాదినః ॥**

ప్రారబ్ధము మాత్రము అనుభవించుట ద్వారానే ఖర్చైపోవును. తత్త్వజ్ఞానము వల్లనే భవము అనెడి సంచితము దగ్ధమగును. నిష్కామకర్మయోగము వలన అగామికర్మ యేర్పడదు. సాధనయనగా ఒకనిలో నున్న త్రిగుణ స్వభావమును మార్చుకొనుట మరియు రాగద్వేషములు కలుగకుండుట. ఆపదలయందు కుంగక యుండుట మరియు సంపదలయందు పొంగక యుండుట. **సిద్ధసిద్ధ్యో సమోభూత్వా సమత్వం యోగముచ్యతే ॥** భ.గీ కర్మఫలముగా ఆశించినది వచ్చినను, రాకపోయినను సంతోషముగాని, దుఃఖముగాని లేకుండటయే కర్మయోగము. ఫలించినా ఫలించకపోయినా ఒక్కటేననే సమదృష్టిని నిష్కామకర్మయోగమందురు. ఇది తడిగా నున్నమట్టి గోడపైకి విసిరిన గోలీవంటిది. అదే గోలీ కనుక సిమెంట్ గోడపైకి విసిరినచో తిరిగి వెనుకకు వచ్చును. అప్పుడు ప్రారబ్ధమే అగామిని సృష్టించుచున్నది. తడిగానున్న గోడలో గుచ్చుకొని, వెనుకొకు రాని గోలీవలె ప్రారబ్ధము ననుభవించుచు, అవుననక, కాదనక ఊరకుండవలెను. అప్పుడు ఆగామి ఏర్పడదు.

**భవము పూర్వకర్మ ఫలము**

**గలిగెననుచు, మదిని గట్టి పరచి,**



**కష్ట సుఖములేవి కలిగిన తలపకు**

**విశ్వదాభిరామ వినురవేమ ॥**

ప్రారబ్ధము పూర్వజన్మకర్మఫలము గనుక తప్పించుకోలేమని తెలిసి, మనసును గట్టిపరచి, కష్టసుఖములు కలిగినప్పుడు ఓర్చుకొనుటయేగాదు, వాటిని తలపను కూడా తలపరాదు. తిరిగి ప్రతిచర్యకు పూనుకొనినను, తలచినను కూడా అగామికర్మ యేర్పడును. కనుక కర్మ అంటకుండా జాగ్రత్త పడవలెను. సంసార మందుడియు, సంసారము తనలో లేకుండా చూచుకొనవలెను. ఎట్లనగా నావ సాగరములోనున్నచో తేలునుగాని, సాగరజలము నావలోనికి చేరినచో నావ మునుగును. కమలము నీటిలోనేపుట్టి దాని కాడ, వ్రేళ్ళు నీటిక్రిందనే ఉన్నను, అది ఎప్పుడూ నీటినంటక నీటిపైనే యున్నట్లు, కర్మవలనపుట్టి, కర్మానుభవము నొందుచున్నను, తాను మాత్రము కమలమువలె, కర్మనంటకయుండవలెను. నీటికోడి నీటిలో ఉన్నను, దాని రెక్కలు పొడిగా నుండి, పైకెగిరిపోవును. కుమ్మరిపురుగు మట్టిలో తిరుగుచు కూడా మట్టినంటకయుండును. ఆ విధముగా నిష్కామకర్మ చేయవలెను. తేనె అంచున నున్న ఈగ తేనె రుచిని ఆస్వాదించును మరియు సురక్షితముగా ఎగిరిపోవును. కాని ఆ ఈగ తేనెలో పడి చిక్కుకుపోతే, రుచిని ఆస్వాదించలేదు సరికదా, గిలగిల కొట్టుకుని తనప్రాణాన్ని విడుస్తుంది. అందువలన సంసారంలో పడి చావరాదు. కాని కర్మచేసియు కర్మనంటని విధముగా నుండవలెను. అనగా మనసుకుచెందిన కర్మలను, **నేను**కు అంటక సాక్షిగా నుండవలెను.

ఆ విధముగా నున్నవాడికి అగామికర్మ యేర్పడదు. కనుక ప్రతిస్పందనకు కారణమైన స్వభావమును మరియు గుణములను మార్చుకొను సాధన చేయవలెను. అయినను దేహము నేననెడి

భావమున్నంత వరకు ఒకడు ఏది చేసినా అది కర్మయే అవుతుంది. **నేనుఎవరు?** అన్నదానికి "దేహము నేనుకాదు", "నేను ఆత్మను" అను జవాబు వచ్చినది కనుక దేహమునకు సంబంధించిన వాటిపై వివేక వైరాగ్యాలు కలుగవలెను మరియు ఆత్మానందము నొందుటకై తహచెందవలెను.

దేహమునేనుకాదను భావముండవలనే గాని, దేహము నకు, వ్యాధి, బాధకలిగినప్పుడు, వైద్యునివద్దకువెళ్లి ఉపశమనములేక నివారణ పొందవలెను. అది యెట్లనగా మట్టికుండలోని మంచినీరు దాహము తీర్చగలదు. అందువలన మట్టికుండను పగలకుండా జాగ్రత్త చేయవలెను. లేనిచో దాహము తీరదు. అటులనే ఈ దేహమును ఆధ్యాత్మిక బోధకొఱకును, యోగసాధన కొఱకును జాగ్రత్తగా నుంచుకొనవలెను. అయినను యీ దేహము విలువ మట్టితో సమానమని జ్ఞాపకముంచు కొనవలెను.

దేహ ధర్మము జరామరణములు, ప్రాణధర్మము ఆకలిదప్పులు, మనసు ధర్మము శోకమోహాలు. ఈ ఆరింటిని షడూర్మ్ము లందురు.వీటికి వేరైన వానిగా ఉండవలెను. షడూర్ములు పోయినచో అదే మోక్షము. **షడూర్మి సహితః జీవః, షడూర్మి రహితః శివః ॥**



## 9. అజ్ఞానము

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా**
**చక్షురున్మీలితంయేన తస్మై శ్రీ గురవేనమః ॥**

శిష్యుని అజ్ఞానమనే చీకటిని గురువు జ్ఞానమనే కాటుకపెట్టి, ఆ శిష్యుని జ్ఞాననేత్రమును తెరచుకొనునట్లు చేయును. అట్టి గురువునకు నేను నమస్కరించుచున్నాను.

అజ్ఞానమంటే ధృతరాష్ట్రుడే. 'దేహమే నేను' అనెడి పరిమితత్వము ధృతరాష్ట్ర పదమునకు అర్థము. అతడు పుట్టు గ్రుడ్డివాడు అనగా జ్ఞానము విషయములో గ్రుడ్డివాడు అనగా అజ్ఞాని. ధృతరాష్ట్ర కౌగిలి యనగా దేహభావనను కౌగలించుకొని, విడువనివాడు. సంజయుడు రాయబారిగా పాండవుల వద్దకు వెళ్ళివచ్చిన పిదప, ధృతరాష్ట్రునికి ధర్మరాజాదుల అభిప్రాయము తెలుపుచూ, హితబోధకూడా చేశాడు. సంజయుడనగా సమ్యక్ జ్ఞానము కలవాడని యర్థము. అనగా పూర్ణమైన జ్ఞాని. పుత్రుడైన దుర్యోధనుని పైగల ప్రేమవలన రాజీపడలేక యుద్ధము తప్పదని వేదన చెందిన ధృతరాష్ట్రునికి నిద్రపట్టలేదు. విదురిని రప్పించుకొని నీతివాక్యాలు విన్నాడు. అన్నీ తెలిసియు పుత్రుని ఒప్పించుటకు ప్రయత్నము చేయక, పరమార్థం చెప్పమన్నాడు. విదురుడు భక్తితో సనత్సుజాతుల వారిని స్మరించగా సనత్సుజాతుడు దర్శనమిచ్చి ధృతరాష్ట్రుని యొక్క అనేక సందేహములకు సమాధానమిచ్చిరి. దుర్గుణాలను వదులుచు, సద్గుణాలను పెంపొందించుకోవలసినదిగా ధృతరాష్ట్రునికి బోధచేసిరి. ఆత్మానాత్మ విభజనచేసి, బ్రహ్మాత్మానుభావమును తెలిపిరి.

**సనత్సుజాతుని బోధ** :- నిష్కామ భావముతో నిష్కల్మషమైన తపస్సు, యజ్ఞము చేస్తే పరమాత్మ ప్రాప్తి లభిస్తుంది.

కల్మషాలు పంద్రెండు. (1) క్రోధం, (2) కామం, (3) లోభం, (4) మోహం, (5) విషయసుఖాపేక్ష, (6) కృపలేకపోవడం, (7) అసూయ, (8) గర్వం, (9) రోషం, (10) స్పృహ, (11) ఈర్ష్య, (12) జుగుప్స. వీటిని వదలవలెను.

పాపాలు చేసేవారు ఆరు రకాలు. (1) దురాశ, (2) స్వాభిమానము, (3) కోపము, (4) చపలత్వము, (5) ఆత్మస్తుతి, (6) ఆశ్రితులను రక్షించలేకపోవడం. ఇవి వదలకపోతే పాపము.

దుష్టవర్తనుల స్వభావము ఏడు విధములు:- (1) సుఖభోగాపేక్ష, (2) ఇతరులకు అపకారము చేయుటవలన పైకివచ్చుట, (3) దానం చేసి, వగచుట, (4) అల్పలాభం కోసం ఎంతటి అవమానాన్నైనా సహించుట, (5) బుద్ధిబలం లేకపోవుట, (6) కుటిలాత్ములను ప్రశంసించుట, (7) ఉత్తమురాలైన భార్యను ద్వేషించుట. వీరిని నృశంసు లందురు.

బ్రహ్మజ్ఞానికి ఉండవలసిన సద్గుణాలు పంద్రెండు :- (1) సత్యం, (2) దమం, (3) శాస్త్రపఠనం, (4) మాత్సర్యం లేకుండుట, (5) తప్పుచేసినందు వలన లజ్జ, (6) సహన శీలత్వం, (7) అసూయ లేకుండుట, (8) నిష్కామయజ్ఞం, (9) దానం, (10) దృఢత్వం, (11) అంతరింద్రియ నిగ్రహము, (12) భగవత్ జ్ఞానం.

దమం అను దానికి దోషాలు పదునెనిమిది :- (1) అసత్యభాషణము, (2) పరనింద, (3) విషయలాలస, (4) అందరకి ప్రతికూలత, (5) అజ్ఞానము, (6) అసంతుష్టత, (7) లోక ద్వేషము, (8) నమ్రత లేకుండుట, (9) కలహ స్వభావము, (10) ప్రాణపీడనము, (11) నిరంతర దూషణము, (12) నిరర్ధక సంభాషణము, (13) పరితాపము చెందుట, (14) సుఖ దుఃఖాలను ఓర్వలేకుండుట, (15) ఇంద్రియ నిగ్రహము లేకపోవుట, (16) ధర్మ జ్ఞాన వైరాగ్యాలు లేకుండుట, (17) పాపము చేయుటయందు ఆసక్తి,



(18) అకారణ ప్రాణహింస. వీటివలన మదము కలుగును. ఇవి తొలగినచో దమము కల్గును.

త్యాగాలు ఆరు విధములు :- (1) సంపద ఉన్నదికదా యని అతిశయింప కుండుట, (2) ప్రతిఫలం కోరకుండా సత్కర్మాచరణ, (3) కామ త్యాగము జితేంద్రియత్వము, ఇది అన్ని త్యాగాలలోను ఉత్తమము. (4) ధనత్యాగము, (5) చేసిన పనులు ఫలించక పోతే చింతించ కుండుట, (6) తనకు అప్రియం కలిగినను ఎప్పటికి దుఃఖించకుండుట. త్యాగము అత్యంత ప్రధాన గుణముగా భావించవలెను. త్యాగము ముక్తికి హేతువు.

**అజ్ఞానం నుండి విడుదల పొందడానికి ఎనిమిది గుణాలు.**

(1) సత్యము, (2) ధ్యానము, (3) సమాధి, (4) యదార్ధస్థితిని గూర్చిన తర్కము, (5) వైరాగ్యము, (6) దొంగబుద్ధి లేకుండుట, (7) బ్రహ్మచర్యము, (8) పుత్ర మిత్ర కళత్రాదుల విషయములో ఆసక్తి లేకుండుట.

ఈ విధమైన సనత్సుజాత బోధవినియు, ధృతరాష్ట్రుడు అజ్ఞానాంధకారముతోనే ప్రవర్తించి, తుదకు పుత్ర మిత్ర బంధు నాశనమునకు కారకుడయ్యెను. మిక్కిలి దుఃఖితుడయ్యెను. కనుక అజ్ఞానము ఎంత ప్రమాదమో కదా!

ఇంకను పంచమహాపాతకములున్నవి. (1) మద్యపానము, (2) బ్రహ్మహత్య, (3) బంగారము దొంగిలించుట, (4) గురుపత్నిని పొందుట, (5) పైనలుగురితో స్నేహముచేయుట. ఇట్టి వారు నీచ ఉపాధులందు అనేకమార్లు జన్మింతురు మరియు ఘోర నరకమున‌నుభవించెదరు. మరల మానవ జన్మ రావడానికి యుగములు పట్టును. సాధన, మోక్షమను మాటలే కనుమరుగగును.

భగవద్గీత 16వ అధ్యాయములో దైవీగుణాలు

వర్ణించబడ్డాయి. అనగా వాటికి వ్యతిరేకమైనవి అసుర గుణమలన్నమాట. ఈ అసురగుణములను మార్చుకొని దైవీగుణాలను పెంపొందించుకొనుమని గీత తెలుపుచున్నది.

**దైవీగుణాలు ఇరువదియారు :-**

(1) అభయము, (2) అంతఃకరణశుద్ధి, (3) జ్ఞానయోగ మందుండుట, (4) దానము, (5) ఇంద్రియనిగ్రహము, (6) యజ్ఞము, (7) వేదాధ్యయనము, (8) తపస్సు, (9) ఋజుత్వము, (10) అహింస, (11) సత్యము, (12) క్రోధము లేకుండుట, (13) త్యాగము, (14) శాంతి, (15) ఇతరుల దోషాలను ఎంచకుండుట, (16) విషయలోలుడు కాకుండుట (17) మృదు స్వభావము, (18) ధర్మ విరుద్ధమైన కార్యములందు ఆసక్తి చూపకుండుట, (19) సర్వభూతదయ, (20) చపలత్వము లేకుండుట, (21) బ్రహ్మతేజస్సు కలిగియుండుట, (22) ఓర్పు, (23) ధైర్యము, (24) శుచి, (25) ద్రోహము చేయకుండుట, (26) నిరభిమానము.

దంభము దర్పము దురభిమానము, క్రోధము, పురుషత్వము, అజ్ఞానము, మొదలగునవి అసుర గుణాలుగా చెప్పబడ్డాయి. వీటిలో కామక్రోధలోభాలు మూడును నరకద్వారాలుగా పేర్కొనబడినవి. మానవుని ఇష్టాయిష్టములు అతని గుణ కర్మ స్వభావముల వలన కలిగినవి. అందులకనుగుణముగా కొన్నింటిని, కొందరిని తనతో ఉంచుకొని, ప్రయోజనము నాశించుచున్నాడు. అట్టివారిపై రాగము కల్గుచున్నది. కష్టనష్టములు కల్గించే వాటిని ద్వేషించుచు, జాగ్రత్త పడుచు, దూరము చేసికొను ప్రయత్నము చేయుచున్నాడు. వీటివలన అతనికి సంసారమేర్పడినది. తన సంసారమును తానే నిర్మించుకొని, ఆ సంసారములో బంధింపబడుచున్నాడు. ఇదే అజ్ఞానము.



**లూతా తంతూపమేయా** సాలెపురుగు తన గూడునుతనే నిర్మించుకొని, తన వృద్ధాప్యములో కదలలేక, తన గూటి దారాలలో చిక్కుకొని, ఆహారము లేక మరణించును. అట్లే మానవుని సంసార బంధము కూడా స్వయం కృతమే.

ప్రకృతిలో గల ఆవరణశక్తి వలన తాను **ఆత్మ** ననే అనుభవము మరుగున పడెను. ప్రకృతిలో గల విక్షేపశక్తి వలన తన కర్మానుసారమైన జన్మను నిజమని జీవభావము నొందుచున్నాడు.

ఆవరణశక్తికి మూలము తమోగుణము. విక్షేపశక్తికి మూలము రజోగుణము. మానవునిలో ఈ రెండుగుణములు చేరి అవిద్య లేక అజ్ఞానముగా పరిణమించినవి. సత్యాన్వేషణ చేసి తాను బ్రహ్మమేనని తెలియుటను విద్య లేక జ్ఞానమందురు. అవిద్య వలన విక్షేపము, విక్షేపము వలన జీవుని జీవితము సత్యమను భ్రమ, భ్రమ వలన సంసారము, సంసారము వలన సుఖ దుఃఖమయ అనుభవములు, వాని వలన విషయ వాసనలు, వాసనల వలన పునర్జన్మ, జన్మ వలన మరలా కర్మ చేయుట జరుగుచున్నది. ఇట్టి జన్మ – కర్మ చక్రములో తిరుగుచు బయట పడలేక పోవుటకు కారణము అవిద్య లేక అజ్ఞానము.

అజ్ఞానము పోయిన గాని, బంధవిముక్తి కాదు. అసత్యమైన జీవజగత్తులను అవి ఉన్నట్లు భ్రమపడుతున్నప్పుడే అవి లేనివిగా విచారించి తెలిసికొనవలెను. భ్రమనుండి బయటపడిన వెంటనే సత్యవస్తువు అయిన **ఆత్మ** అనుభవముగా మారును. ఇవన్నీ తెలిసినను, తనలోని గుణ స్వభావములను మార్చుకొనుటకుగాను కొంత సాధన చేయవలెను. తనలోని త్రిగుణములను తొలగించుకొనవలెను. ఎందుకనగా తమోగుణము ఇనుపసంకెళ్ళు. రజోగుణము వెండి సంకెళ్ళు. సత్వగుణము బంగారు

సంకెళ్ళు. గుణము ఎంత గొప్పదైనను బంధమే.

**సత్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభయేవచ**

**ప్రమాదమోహౌ తమసో భవతో అజ్ఞానమేవచ ॥**

సత్వగుణమువలన జ్ఞానము, రజోగుణమువలన లోభము, తమోగుణము వలన మోహము కల్గును. కనుక త్రిగుణాలను విమర్శించి, తమోరజో గుణములను విడువవలెను. సత్వగుణముతో శ్రవణము, మననము, విచారణ, సాధన మొదలగునవి చేసినచో ఆత్మలాభము కల్గును.

**త్రిగుణములు** :– మానవునిలో మూడుగుణాలున్నవి. అందులో ఒక గుణము ప్రధానముగా పనిచేయునప్పుడు మిగిలిన రెండు గుణములు అణగి యుండును. ఎక్కువగా యేగుణము ప్రధానముగా నుండునో అతనిని ఆగుణ స్వభావిగా పిలిచెదరు. కాని తన కర్మానుభవమునకు తగినట్లు అన్ని గుణములు ఒక్కొక్కటి ఒక్కొక్కసారి ప్రధానముగా పనిచేయును. ఈగుణముల యొక్క వ్యక్తీకరణమే కామక్రోధాదులుగాను, ఆశామోహాలు గాను కనబడుచుండును.

**తమోగుణము** :– తమోగుణ ప్రధానులు సోమరిపోతులు, బద్ధకస్థులు, బాధ్యతలను స్వీకరించరు, పనులను వాయిదావేయుదురు. మూర్ఖముగా ప్రవర్తింతురు. పెద్దలమాట వినరు. తనమేలుకోసం చెప్పే సలహాకూడా వినరు. అతిగా నిద్రించుట, అతిగా తినుట, క్రమశిక్షణ లేకుండుట, తనకు తానే ప్రమాదములోపడుట యనునవి జరుగుచుండును. మరచిపోవుట సహజము. మితిమీరిన ఆశావెూహములుండును. లోభత్వముతో ప్రవర్తించుచుందురు. జంతువులవలె జీవించుచుందురు. తామసిక ఆహారమైన మాంసము మొదలగునవి భుజించును. కుంభకర్ణుడు తమోగుణమునకు ఉదాహరణము. ఇతడు శిష్యునిగా పనికిరాడు.



**రజోగుణము** :– రజోగుణ ప్రధానముగా నున్నవారు తొందరపాటుతనము, విసుగు, ఆందోళన కలిగియుందురు. పొరపాట్లుచేసి పశ్చాత్తాపపడుదురు గాని, మరల పొరపాట్లు చేయుచునే యుందురు. గుణపాఠము జరుగదు. సలహాలు వినెదరుగాని, పాటించరు. తొందరుపాటులో కష్టాలు తెచ్చుకొందురు. ఇతరులకు హానిచేయుచు, శత్రువులను పెంచుకొందురు. విన్నదానిని విపరీతభావము చేయుచు, అతితెలివి ప్రదర్శింతురు. తాను ఆరంభించు పనికి ప్రణాళిక యుండదు. మధ్యలోనే విడచిపెట్టెదరు. నిద్రాహారములలో క్రమశిక్షణ యుండదు. పులుపు, కారము, మాంసము మొదలగు రాజసికాహారమును భుజించుచుందురు. ఊహాజనితములను లక్షించి, సాధించలేక భంగపడుచుందురు. క్రోధము, మదము, మత్సరము, దంభము, దర్పము, అహంకారములతో వ్యవహరించుచుందురు. రావణాసురుడు రజోగుణమునకు ఉదాహరణము. రజోగుణస్వభావి కూడా శిష్యునిగా పనికిరాడు.

**సత్వగుణము** :– సత్వగుణము ప్రధానముగా ఉన్నవానికి ఓర్పు, త్యాగము, దైవభక్తి యుండును. ఎవరిని నొప్పించరు. దయ, సానుభూతి, దానగుణము ఉండును. ఆపదలందు కుంగక, సంపదలందు పొంగక ధీరులవలె నుందురు. పెద్దలమాటలను విని, సలహాలను స్వీకరించి, విమర్శించుకొని యుక్తముగా వ్యవహరింతురు. క్రమశిక్షణతో జీవించుచు, అన్నిపనులను ప్రణాళికాబద్ధముగా చేయుదురు. ఆరంభించిన పనిని పట్టుదలతో నెరవేర్చెదరు. సేవ, దానము, ఉపకారము వంటివి చేయుదురు. సాత్వికుడు సత్సాంగత్యమును చేయును. తీపి, శాఖాహారము వంటివి తినును. సాత్వికాహారమును హితాహారముగా మితాహారముగా స్వీకరించును. సత్వగుణమంటే మితభాషణ, మితాహారము, మితనిద్ర, సమదృష్టి

అలవాటుగా నుండుట. అన్నము యొక్క సూక్ష్మాంశము మనసు గనుక సాత్వికాహారము భుజించినచో, తమో రజోగుణములను నిగ్రహించుట సాధ్యపడును. సత్వగుణమున్న వారికే జ్ఞానము అబ్బును. విభీషణుడు సత్వగుణమునకు ఉదాహరణము. సాత్వికుడు శిష్యునిగా పనికివచ్చును.

దైవీభావము వలన ప్రశాంతత నొందిన సాత్వికుడు, యిక తానే దైవమైనచో అతడికి ఎంత ఆనందమో! యని గురుని ఆశ్రయించి జ్ఞానవంతుడగును. సాత్వికుడు సజ్జనసాంగత్యము చేయును. సజ్జన సాంగత్యమువలన సద్గుణములు పెంపొందును. దుర్జనసాంగత్యమువలన తాను ఇహపరాల రెంటికిని చెడును. మన్ను గాలితో స్నేహము చేసి పైకి వెళితే, అదే మన్ను నీటితో చేరి బురదగా మారినట్లు, సజ్జన సాంగత్యములేకపోతే పతనమగును. అలాగే ఇనుము నీటితో స్నేహం చేస్తే తుప్పుపట్టును. అగ్ని సాన్నిధ్యముచేత ఇనుము శుద్ధియగుచున్నది. వాసనలేని దారానికి, పుష్పములతో మాలకట్టినప్పుడు, ఆ సువాసన దారానికి కూడా అబ్బును. అటులనే సజ్జన సాంగత్యం వలన ఎంతో మేలు జరుగను. చివరకు మోక్షలాభమగును. తన అహంకారమును రెచ్చగొట్టువారిని, తన సత్వగుణమునకు పరీక్షపెట్టు వారిని ద్వేషింపక, వారిని గురువుగా భావించి, నిగ్రహించును. ఎందుకనగా తనకోపమును జయించెనో లేదోయని తెలియవలెనన్న తనను రెచ్చగొట్టి కోపము తెప్పించెడి వారుండవలెను కదా! అప్పుడే తనకోప నిగ్రహమునకు పరీక్ష జరుగును.

ఈ విధముగా తన సత్వగుణము నుండి జారిపోకుండా ప్రయత్నించు చుండును. గృహస్తాశ్రమమును బంధముగా భావించక, తన సాధనకు ప్రయోగశాలగా చూచుకొనును. సాత్వికుడైనవాడు తన



గుణస్వభావములనుండి విడుదలై, ఆత్మజ్ఞానమునొందును. గుణములను మార్చుకొనుటయనగా ఆ గుణముల వ్యక్తీకరణములైన కామక్రోధాదులను, రాగద్వేషములను, అహంకారమును గుర్తించి, నిగ్రహించి దాటవలసి యున్నది.

**కామక్రోధాదులు** :–

**మనోహి ద్వివిధం ప్రోక్తం, శుద్ధం చాశుద్ధమేవచ**
**అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామ వివర్జితం ॥**

మనసు అనేది రెండు విధములు. ఒకటి కామక్రోధాదులతో కూడినది. రెండవది కామక్రోధాదులనుండి విడుదలైనది. కామక్రోధాదుల వలన ఇష్టాయిష్టములు ఏర్పడి, వాసనలు కల్గును. అది పునర్జన్మహేతువు. కామవివర్జితము కొఱకు సాధనముచేసినచో, అదే ముక్తి. కావున కామక్రోధాదులు ఎంత ప్రమాదమో చూడుడు.

**కామము** :– అన్నిరకములైన దేహేంద్రియ భోగసంబంధమైన కోరికలను కామము అందురు. నరకాసురుడు స్త్రీ వ్యామోహము వలన పదహారువేల మందిని నిర్బంధించగా, శ్రీకృష్ణ సత్యభామలు నరకాసురుని వధించి, స్త్రీలను చెరనుండి విడిపించిరి. కామమునకు ఊర పిచ్చుక ఉదాహరణము. కామము నశించిన గాని ఆత్మారాముడు లభించడు. "కాముదున్నంత సేపు రాముడు ఉండడు. కాముడు పోతేగాని రాముడు రాడు" కాముడనగా అనాత్మ భావము. రాముడనగా ఆత్మభావము.

**క్రోధము** :– క్రోధమనగా కోపము. కోపము వలన గొప్పతనము సన్నగిల్లును, గుణము చెడిపోవును, బ్రతుకు దుర్భరమగును.

**కోపమునకు ఘనత కొంచెమైపోవును**
**కోపమునకు గుణము కొఱతపడును**

**కోపమునకు బ్రతుకు కొంచెమైపోవును**

**విశ్వదాభిరామ వినురవేమ ॥**

క్రోధము వలన బకాసురుడు ఎవరినీ లెక్కచేయక నరులను చంపి తినుచుండెను. తుదకు భీమసేనునిచేత మర్దించబడెను. క్రోధమునకు తోడేలు ఉదాహరణము.

**క్రోధోహి శత్రుః ప్రథమో నరాణాం**

నరునికి క్రోధవే ప్రథమ శత్రువు. ఉత్తముని కోపము క్షణకాలముండును. మధ్యముని కోపము రెండు ఘడియలుండును (48ని॥లు). అధముని కోపము ఒకరాత్రి ఒక పగలు ఉండును. నీచుని కోపం తాను మరణించువరకు ఉండును.

**తనకోపమె తనశత్రువు తన శాంతమె తనకు రక్ష** సుమతి శతకము.

కోపము వలన రక్తపోటు పెరిగి, గుండె ఆగి చనిపోయిన వారున్నారు. శాంతముగా నుండగలవారు నూరేళ్ళు జీవింతురు. పరమశాంతియే మోక్షముకదా!

**లోభము** :– లోభి తనకు లభించిన దానిని తన స్వంతము చేసికొనును. తిరిగి యెవ్వరికిని యివ్వనిచ్చగించడు. దుర్యోధనుడి మాయా జూదము వల్ల పాండవుల రాజ్యమును గెలచి, పాండవుల అరణ్య అజ్ఞాతవాసముల పిదప తిరిగి వారి రాజ్యమును వారికిచ్చుటకు అంగీరకరించలేదు. చివరకి ఐదుగురికి ఐదూళ్ళను కూడ నివ్వదలచలేదు. అందువలన సోదరులను బంధువులను, మిత్రులను, గురువులను కూడా నశించునట్లుజేసి, తానును మరణించెను. లోభమునకు గ్రద్ద ఉదాహరణము.

**మోహము** :– మోహమనగా పుత్ర మిత్ర కళత్రాదులందును ధన, ధాన్య, వస్తు, వాహనములందును మిక్కుటమగు ప్రేమ. మోహమనగా



యుక్తాయుక్తములను ఎరుగని చిత్తవృత్తి. ధశరథ మహారాజు భార్య కైకేయికిచ్చిన మాటను వెనుకకు తీసుకొనలేక, శ్రీరాముని కారడవులకు పంపుటకు కారణమై, చివరకు మోహావేశమునకు లోబడి మరణించెను. మోహమునకు గుడ్లగూబ ఉదాహరణము.

**మదము** :– అపరిమితమైన అహంకారము వలన ఎవరినీ లెక్కచేయక పోవుట మరియు విఱ్ఱవీగుటయే మదము. అష్టవిధ మదములున్నవి. తనకులము గొప్పదని, తనబలమున కెదురులేదని, తనకు ఆస్తి, పొలాలు, స్థలాలు ఎక్కువని, సంపదలు ఎక్కువని, యౌవ్వన మిడిసిపాటుగాను, అందగాడని, జ్ఞానియని, తాపసియని గర్వపడుతూ, ఇతరులను పరిహసించుటయు, బాధించుటయు మదమనబడును. జమదగ్ని యొక్క కామధేనువును అడిగిన వెంటనే యివ్వలేదని, దానినపహరించిన కార్తవీర్యార్జుని పుత్రులు వారి మదమువలన పరశురామునిచే వధింపబడిరి. గరుత్మంతుడు మదమునకు ఉదాహరణము.

**మత్సరము** :– ఎందులోనైనా తనకంటే ఇతరులు ఎక్కువగా నుండుటను ఓర్వలేకుండుటను మత్సరమందురు. శిశుపాలుడు శ్రీకృష్ణుని గొప్పతనమును సహించలేకపోయెను. నూరు తప్పులు క్షమించబడిన పిదప శ్రీకృష్ణుని చేతిలో శిశుపాలుడు సంహరించబడెను. కుక్క మత్సరమునకు ఉదాహరణము.

ఈ కామ క్రోధ లోభ మోహ మద మత్సరములను అరిషడ్వర్గమందురు. ఇవి మానవునిలోనే ఉన్న అంతఃశత్రువులు. ఈ శత్రువులను జయించిన వాడు జితేంద్రియుడగును. అందువలన మోక్షమార్గము సుగమమగును. బయటి శత్రువులను జయించే వీరుని గమ్యం స్వర్గము, కాని అతడు తిరిగి జన్మించును. లోపలి శత్రువులైన అరిషడ్వర్గమును జయించే ధీరుని

గమ్యం మోక్షము. అతడు తిరిగి జన్మించడు. క్రోధమును శాంతి చేతను, దుష్టత్వమును సాధుత్వము చేతను, లోభత్వమును దానము చేతను, అనృతమును సత్యము చేతను జయించవలెనని పెద్దలు నుడివిరి.

**రాగము** :- తాను ఇష్టపడిన వారిపై కలిగెడిది రాగము. రాగము అనగా పరస్త్రీ వ్యామోహము కూడా. రావణుడు సీతాదేవిని మోహించి, అపహరించి, విడువమని యెందరు చెప్పినను విడువక, చివరకు శ్రీరామునిచే వధింపబడెను. సోదర, సుతులను పోగొట్టుకొనెను. ఆత్మలింగమును సాధించిన రావణుడు మరియు నవగ్రహాలను శాశించిన రావణుడు ఒక్క రాగము అను దుర్గుణము వలన నశించెను.

**ద్వేషము** :- తన అన్న హిరణ్యాక్షుని శ్రీహరి చంపెనని, తనకేమియు అపకారము చేయకనే హిరణ్యకశిపుడు శ్రీహరిని ద్వేషించెను. తాను చావకుండా ఎన్ని వరములు కోరుకున్నను, నరసింహస్వామిచేత యుక్తిగా చంపబడెను. భక్తులైన వారు దేనిని ద్వేషించరు. ద్వేషమున్నచోట భక్తియుండదు. ప్రహ్లాదునికి హరి భక్తి ఉన్నది. తనను ఎన్ని కష్టములకు గురిచేసినను, తన తండ్రి హిరణ్యకశిపుని ద్వేషించలేదు. శ్రీరాముడు అధర్మమును శిక్షంచెను గాని, రావణునిపై నతనికి ద్వేషములేదు. శరణాగతి కోరినట్లైతే, రావణుని క్షమించి వదలియుండెడివాడు.

**ఈర్ష్య** :- ఈర్ష్యయనగా తనకు మాత్రమే కష్టములు కలుగుచున్నవిగాని, యితరులకెందుకాకష్టములు లేవని, వారిపై కలిగెడి ద్వేషము. అరుణాక్షుడు అను రాక్షసుడు బాణాసురునిపై ఈర్ష్యతో మెలిగి, చావు తెచ్చుకొనెను.

**అసూయ** :- అసూయ యనగా తనకు మాత్రమే సుఖములు కలుగ వలెననియు యితరులకట్టి సుఖములు ఉన్నచో తాను చిన్నబోవునని తలంచుట. పౌండరిక వాసుదేవుడు అకారణముగా శ్రీకృష్ణమూర్తిపై అసూయతో విరోధము తెచ్చి పెట్టుకొనెను. వాసుదేవుడైన శ్రీకృష్ణుని వలన మరణించెను. అసూయాపరులు గురుబోధకు అనర్హులు. అసూయలేనివాడిని అనసూయ అని యందురు. అర్జునుడు అనసూయ గనుకనే శ్రీకృష్ణుడు గీతను బోధించెను. అనసూయ యనగా విశాలార్థములో త్రిగుణాతీతుడు.

**దంభము** :- తాను చేయుపనులను యితరులు మెచ్చుకొనవలెననెడి చిత్తవృత్తిని దంభమందురు. అలా మెచ్చుకొనని వారిపై వైరము పెట్టుకొని అపూరుడు దూర్వాసుని వలన పతనమయ్యెను.

**దర్పము** :- తానే సర్వసమర్థుడని, తనకెవ్వరు సాటిలేరని విఱ్ఱవీగుటను దర్పమందురు. రావణుడు, దుర్యోధనుడు పెద్దలమాట వినక నశించిరి.

**అహంకారము** :- అకారణముగా యితరులను శిక్షించవలెననెడి తమోగుణమును చిత్తవృత్తిగా గలవాడిని అహంకారి యందురు. మధుకైటభులు అహంకారముతో విష్ణువుపై కాలుదువ్వి పోరాడి, పోరాడి చచ్చిరి.

ఈ విధముగా ముముక్షువులైనవారు అరిషడ్వర్గమును జయించి, రాగద్వేషములను, ఈర్ష్యఅసూయలను, దంభ దర్ప అహంకారములను సాధనచే తొలగించుకొనవలెను. అప్పుడే అజ్ఞానము వీడును. అయినను గురువు యొక్క సహాయము అవసరము.

# 10. దుఃఖము, మరణము.

**జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునఃపునః**
**సంసారసాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత్త జాగ్రత్తః ॥**

మొదట గర్భస్థనరకము తరువాత ఇరుకు ద్వారమునుండి బయటపడుటకు పడే బాధ, శైశవమందు ఊహపెరుగకముందు తను ఇబ్బందిపడుతూ, తప్పించుకొనే దారి తెలియక, మాటలలో తలిదండ్రులకు తెలుపనశక్యమై తప్పనిసరిగా బాధననుభవించును మరియు కావలసిన సౌకర్యమునడుగలేడు. కనుక అతడికి దుఃఖమే. బాల్య యవ్వనములందు చదువు, సంపాదనల కొఱకు తపన పడుతూ, శ్రమపడుతూ, చింతపడుతూ, మథనపడుతూ, అసంతృప్తి అపజయములకు లోనగుచు, దుఃఖమునే యనుభవించుచున్నాడు. ప్రకృతి సహజమైన కోర్కెలను తీర్చుకొనుట కొఱకు సాహసించుచు ప్రమాదమును తెచ్చుకొనుచున్నాడు. కొన్నిమార్లు అపజయమును పొందుచున్నాడు.

తన భార్యబిడ్డలు, తన తల్లిదండ్రులు, సోదరులు, బంధుమిత్రులు మొదలగు పాశములచేతను వ్యాపార భాగస్వాములతోను బంధింపబడి, నేను నాది నావారు అనే వాటియొక్క విషయములయందు ప్రియము, మోదము, ప్రమోదమును కోరుచున్నను, అవి కొంతే తీరగా లేక అసలు తీరకపోగా దుఃఖమునే తెచ్చుకొనుచున్నాడు. ఈ విధముగా ఘోరసంసారమను సాగరములో పడి ఈదలేక దరిచేరలేక దుఃఖితుడగుచున్నాడు. కనుక ఇటువంటి జీవితమును కోరుటయనగా దుఃఖమును కోరుటయే. చివరకు ముదిమి, వ్యాధి, మరణము కూడా బాధించి దుఃఖమునే మిగుల్చుచున్నది. నిరంతర దుఃఖము మధ్యలో అప్పుడప్పుడు లభించే విరామమే సుఖము గాని శాశ్వత సుఖమెక్కడిది? కర్మచేయుట



యందు మరలా దుఃఖము కల్గుచుండును గాన, చాలా చాలా జాగ్రత్తగా నుండవలెను సుమా! “ఎదగడానికెందుకురా తొందరా? ఎదర బ్రతుకంతా చిందర వందరా...” అని ఒక సినీ గేయమున్నది. కనుక బ్రతుకు చింతలమయం.

మనము అనిత్యమైన వస్తువులను, ప్రాణులను, సౌకర్యములను కోరుచున్నాము. అవన్నీ ఎప్పుడో ఒకప్పుడు పోయేవే. అందువలన ఆశపడ్డవారికి దుఃఖము అనివార్యము. మరొకవిధముగా, అవన్నియూ లభించికూడా అనుభవించేవాడే ముందుగా పోవచ్చును, లేక దూరము కావచ్చును. అప్పుడుకూడా దుఃఖమే మిగులుచున్నది.

గౌతమబుద్ధుడు రాజపుత్రుడైయుండి అందమైన భార్యకలవాడై ముద్దులొలికే పుత్రుడు కలవాడైకూడా
1) ఒక ముసలవాడిని, 2) ఒక కుష్టువానిని, 3) ఒక శవమును చూచినంతమాత్రమున మానవజన్మ ఎంత దుఃఖభూయిష్టమోనని తలచి అన్నిటిని వదలి శాశ్వత సుఖమునకై అన్వేషణ మొదలు పెట్టెను. బుద్ధుని ప్రకారము చతురార్య సత్యములు చెప్పబడినవి.

**చతురార్య సత్యాలు** :- (1) దుఃఖమే ఉన్నది, (2) దుఃఖానికి కారణం ఉన్నది, (3) దుఃఖనివారణకు మార్గమున్నది, (4) ఆ మార్గమే ఆర్యాష్టాంగ మార్గము. ఫలితము నిర్వాణమనెడి మోక్షము. నిర్వాణమనగా నిర్విషయస్థితిలో మిగిలియున్న చైతన్యానుభవము.

**ఆర్యాష్టాంగ మార్గము**:- (1) సరియైన వాక్కు, (2) సరియైన కర్మ, (3) సరియైన జీవనము, (4) సరియైన స్మృతి, (5) సరియైన సమాధి, (6) సరియైన దృష్టి, (7) సరియైన సంకల్పము, (8) సరియైన కృషి. “సరియైన” అన్నప్పుడు, ఇప్పుడున్న అనాత్మ భావముకాక ఆత్మభావమని అర్థము.

దుఃఖమున్నదని నిర్ణయమైన పిదప ఆత్మ – అనాత్మ విచారణ చేసి తాను అనాత్మ కాదనుటలోనే మూడు శరీరములకు సంబంధించిన షడూర్ములు తొలగుచున్నవి. అనగా జననమరణములు, ఆకలిదప్పులు మరియు శోకమోహములు. తాను ఆత్మననే ధ్యాసవలన కేవలము ఆత్మానుభవము అనెడి ఆనందము కల్గుచున్నది.

దుఃఖమునకు కారణము కోరికలు. తీరిన కొద్దీ కోరికలు పెరుగుతునే ఉంటాయి. మరలా మరలా అనుభవించవలెనని తృష్ణ కలుగుతునే ఉంటుంది. మన కోరికలు తృష్ణలు హిమాలయపర్వతాలకంటే కూడా పెద్దవి. ఒక వేళ మన ఆయుస్సును 100 నుండి పెంచి వేలాది సం॥లు ఉండేటట్లు చేసినను, ఇంద్రియ భోగాలయందిచ్ఛ తరుగదు.

బైబిల్‌లో ఇలా ఉన్నది “మంచి పనులకు మంచి ఫలితము, చెడ్డ పనులకు చెడ్డ ఫలితము మరియు మరణమునకు తీర్పు ఇవ్వబడును”. మరణమంటే చాలా మందికి భయమే. ప్రతిరోజూ ఎవరో ఒకరి మరణాన్ని చూస్తూనే ఉంటాము కాని మరణము మనకోసము కాదన్నట్లు ఉదాసీనముగా గడుపుచూ దుఃఖనివారణాచర్య తీసికొనము. చచ్చేవరకు సంపదను ప్రోగుచేస్తూనే ఉంటాము. మనము వచ్చేటప్పుడు ఏమీ తేలేదు. ఎంత సంపాదించినను మరణించిన తరువాత మనతో ఏమీ తీసుకుని వెళ్ళలేము.

గజనీమహమ్మదు భారతదేశముపై 17 దాడిచేసి ఎంతో బంగారము, వజ్రవైఢూర్యాలు దోచుకొని వెళ్ళాడు. ఎందరినో చంపి స్త్రీలను విధవలుగానూ, పిల్లలను అనాథలుగాను మార్చివేసాడు. అతనికి మరణకాలము రానే వచ్చింది. తను దోచినసొమ్మంతా ఒకగుడారంలో కుప్పగా పోసి చూపించమన్నాడు. అతడికి మరింతదుసఖము కల్గి ఇవన్నీ



ఇక్కడే వదలి పోవాలి కదా! తనతో అవి రావు కదా ! అని తలచి చివరకు తీవ్రమైన దుఃఖముతోనే మరణించాడు.

రాజులు మహారాజులు చక్రవర్తులు నియంతలు ఎవరిని చూచి ప్రపంచము గడ గడా ఒణకినా నేడు వాళ్ళ సమాధులే ఉన్నాయి. ఎప్పటికైనా మనము అంతే. మరణించినప్పుడు మన బంధువలు, స్నేహితులు మనతో రాలేరు. కేవలము ఏడ్వడము తప్ప ఇంకేమీ చేయలేము. ఇక్కడున్న వారు మరణించిన వారికి ఏమి సహాయము చేయగలరు? వారందరితోను మనది కర్మ సంబంధముగా ఇచ్చి పుచ్చుకొనేదే. ప్రేమైనా మమకారమైన స్వార్థముతో కూడుకొన్నదే. మాటవినని భార్యాబిడ్డలను, సుఖమునివ్వని భర్తను, బాధ్యత మరచిన తలిదండ్రులను మనము నిస్వార్థముగా ప్రేమించగలమా? వారందరితో మనకుండేది కర్మల లెక్కే, లెక్క పూర్తికాగానే వారైనా మనని విడచి వెళ్తారు, మనమైనా వాళ్ళని విడచి వెళ్ళిపోతాము. అనగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు.

ఒక నాటక శాలలో పాత్రధారులుగా మనము మన కర్మలకు అనుగుణముగా వచ్చాము. తగినట్టి స్థూలదేహమును ధరించాము. ఇచ్చిపుచ్చుకునే సుఖదుఃఖాలు, వాటి వలన కలిగే రాగద్వేషాలు, మమకార వ్యామోహాలు ఉపకార అపకారాలు మొ॥గు ద్వంద్వాలు తీరిపోగానే రూపనామంగానున్న స్థూల శరీరాలను వదలి ప్రపంచ నాటక రంగమునుండి నిష్క్రమిస్తున్నాము. ఇక్కడి సంబంధాలు ఇక్కడి వరకే గాని మరణించాక అవి మనవెంటరావు మరియు జ్ఞాపకము కూడా ఉండవు. ఒకచోట మరణించినప్పుడు అక్కడి బంధువులు దుఃఖిస్తుండగా మరొకచోట జన్మిస్తున్నప్పుడు అక్కడి వారికి సంతోషము వెల్లి విరుస్తున్నది. ఈ రెండింటిలో దేనిని మనము స్వీకరించాలి? ఎంతగానో అలంకరించి

అభిమానించిన ఈ దేహాన్ని మరణించిన పిదప మనలను ఎంతగానో ప్రేమించిన బంధువులు కూడా మనదేహాన్ని అగ్నికి ఆహుతైనా చేస్తారు లేదా మట్టి యందు పూడ్చి పెడతారు.

అందుకే మనము మరణ సమాయాన్ని గుర్తుంచుకొని దానికి ముందే మన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని పూర్తిచేసికొని గమ్యాన్ని చేరుకోవాలి. మోక్షమంటే సంపూర్ణ దుఃఖనివృత్తి మరియు జన్మరాహిత్యము. అంతేకాదు మోక్షమంటే పరమశాంతి మరియు పరమానంద ప్రాప్తి. దీనికొఱకు చేయవలసినది (1) సాధన చతుష్టయమును సంపాదించుకొని బ్రహ్మవిద్య విచారణ చేయుటకు అర్హతను సంపాదించుకొనుట, (2) మహావాక్య విచారణ గావించి తానే బ్రహ్మమను నిర్ణయముగా నుండిపోవుట. అ రెండింటిని వివరింతము.



## 11. సాధన చతుష్టయ సంపత్తి

ఇంతవరకు మానవుడు తన దుఃఖనివృత్తికి ఏమిచేయవలెనను విషయములో జన్మ, కర్మ పద్ధతిని, **నేనుఎవరు?** అను ప్రశ్నకు ఆత్మజ్ఞానము అవసరమనియు, అజ్ఞానమంటే యేమో వివరముగా తెలిపి, విడువవలసిన గుణములను, పెంపొందించుకొనవలసిన లక్షణములను విశదీకరించుట జరిగినది. అయినను యివి గురుశిష్యుని సంబంధముగా జరిగినచో ఫలితము నిశ్చయముగా కలుగును. ఇదే మానవుని యందున్న కర్తవ్యము. అందువలన మానవజన్మను దురుపయోగము చేయక యిప్పుడే మేల్కొని తగినట్టి సాధనచేయవలెను. ఇది శాస్త్రీయముగా జరుగవలెను. ఈ సాధనపద్ధతి నాల్గుభాగములుగా సాధనాచతుష్టయ సంపత్తిగా పిలువబడు చున్నది.

**(1). నిత్యానిత్యవస్తువివేకము :-**

**ఆత్మనిత్యము సద్రూపమస్ఖలితము**
**తనువనిత్య మసత్పదార్థంబు గాదే?**
**అదియు నిదియును నొకండని**
**యనుటకంటె వేరుగా నుండునే యవివేకమనగ ॥**

ఆత్మనిత్యము, చావనిపుట్టనిది, మార్పుచెందనిది, ఆత్మ చలించనిది. దాని నుండి యేది పుట్టదు మరియు దానిలోకేది లయమవదు. ఈ కనపడే శరీరాలు, ప్రపంచము అనిత్యము, మార్పుచెందేవి. వాటికి ఉత్పత్తి నాశములున్నవి. అందువలన ఇంద్రియ గోచరమైనవన్నియు నశించేవే అనగా **యత్ దృశ్యం తత్ నశ్యం** అంటారు. అనిత్య వస్తువలను ప్రేమించడం వలన దుఃఖమేగా మిగిలేది?

ఒక్క మానవుని శరీరములో విచారిస్తే బయట ప్రపంచములో కూడా

విచారించినట్లే. బయట విచారణ మేధావులకైనను అంతుపట్టదు. అందువలన లోన విచారణను శాస్త్ర ప్రమాణముగా చేపట్టి తెలిసికొనుట సులభము. బయట **బ్రహ్మ సత్యం జగన్మిధ్య** యనునది విచారణయొక్క సారము. లోపల అనాత్మ నశించేదనియు, అది నేనుకాదనియు తెలియుటయే జ్ఞానము. నేను ఆత్మయని తెలియగానే ఆ **నేను**కు మరణము లేదు, జన్మలు లేవు. శరీరాలకే జన్మదుఃఖం, జరాదుఃఖం, వ్యాధిబాధలు, మరణమున్ను.

**ఆత్మనిత్యమనియు, నఖిలప్రపంచ మ**
**నిత్యమనియు, నెఱుంగనేర్చుబుద్ధి**
**విస్తరించుటయె వివేకంబు, మోక్షార్థి**
**జనులకెల్ల నిట్టి సరణి వలయు ॥**

మోక్షము కోరు వారికి ఆత్మ అమృతమని, ప్రపంచము మరియు తన శరీరభాగాలు నశించే గుణములు కలవనియు విచారణచే తెలిసికొని, అనిత్యవస్తువందు వైరాగ్యాలను పెంచుకొనవలెను. మరియు ఆత్మాను భవము కొఱకు ఆసక్తితో ధ్యానము చేయవలెను.

**2. ఇహాముత్రఫలభోగవిరాగము** :–

**బ్రహ్మలోకమాది పరమాణు పర్యంత**
**భోగ్యజాతమందు బొడమ వలయు**
**గాకిరెట్టయెడల గలుగు జుగుప్స, వై**
**రాగ్యమనగ నదియె యోగ్యమగును ॥**

చేసిన పుణ్యమువలన భూలోకములో భోగములు కలుగును. దుఃఖము లేదు కదా యని, సాధన మానరాదు. మనస్సు రాగద్వేషయుక్తము కారాదు. సుఖము వెంట దుఃఖము, దుఃఖము వెంట సుఖము వచ్చుచునే యుండును.



అగ్ని ప్రమాదము సంభవించినప్పుడు బావిత్రవ్వుట మొదలుపెట్టినచో అది తగులబడుటను ఆపలేదు. ముందే బావి త్రవ్వినచో, అగ్నిని వెంటనే చల్లార్చవచ్చును. అదే విధముగా శాశ్వతానందము కొఱకు తాత్కాలిక సుఖము కల్గినప్పుడు వైరాగ్యముతో అవుననక, కాదనక, ఆస్వాదించక అనుభవించవలెను. సుఖమునకు కర్త, భోక్త అయినట్లైతే అగామి యేర్పడి పునర్జన్మహేతువగును. అందువలన భువర్లోక, సత్యలోక (బ్రహ్మలోక), సుఖములు లభించినను వాటిపై రాగము జనించరాదు. కాకిరెట్టమీద కలుగు అసహ్యము మాదిరిగా యాభోగములను గ్రహించవలెను.

అరిష్టనేమి యనే మహారాజుయొక్క తపస్సుకు దేవేంద్రుడు మెచ్చి, లేక అతని తపస్సును పరీక్షించుటకై, మాతంగియను దేవదూతను పంపెను. మాతంగి స్వర్గలోకమునకు గొనిపోవుటకు విమానముతో సహావచ్చి, అరిష్టనేమిని స్వర్గమునకు ఆహ్వానించెను. స్వర్గలోకభోగములను అడిగి తెలిసికొని, యిట్లనుకొనెను. యజ్ఞయాగాది ఫలము ఖర్చుకాగానే తిరిగి మర్త్యలోకమునకు పంపబడుదురు, ఈ మాత్రముదానికి స్వర్గమునకు వెళ్ళుట, తిరిగి వచ్చి సాధన చేసికొనుట యెందుకు? ఒక జన్మకాలము వృధాయగుచున్నది మరియు రాబోవుజన్మ సాధనకు అనుకూలమైనట్టి ఆరోగ్యము, పరిసరములు ఉండునో లేదో? అసలు మరల మానవజన్మే కలుగునని నిశ్చయమున్నదా? అతడి సంచితకర్మరాశిలో ఏమేమియున్నవో తెలియదు కదా! అని అరిష్టనేమి విరాగముతో స్వర్గమును నిరాకరించెను.

అందువలన ఇహలోక, బ్రహ్మదిలోక భోగములను అవి కర్మానుసారముగా కలిగినప్పటికిని యిష్టాయిష్టములు లేక అనుభవించి ఖర్చు చేసికొనవలెను. అంతేగాని కోరి, ఆస్వాదించి, అగామి కర్మనేర్పరచు కొనరాదు.

**శమాదిషట్కసంపత్తి :-**

**శమదమాదులు :-**

> **చిత్తమున పూర్వవాసనల్ చేరనీక**
> **తొలగ ద్రోయుట శమమని పలుక నొప్పు**
> **మఱ్ఱ బాహ్యేంద్రియంబుల నిగ్రహంబె**
> **దమ మశేష కాలుష్య విచారకంబు ॥**

ప్రారబ్ధమందున్న వాసనలు కాలానుగుణ్యముగా, ఎప్పుడెప్పుడేయే కర్మ అనుభవమునకు రావలెనో అప్పుడప్పుడు చిత్తమందవి వృత్తిగా మారి, మనస్సునందు కలుగు ఆలోచనలను నిగ్రహించుటను శమమందురు. మనస్సు శమించకపోయినచో బుద్ధి కర్మానుసారము నిర్ణయించుచుండును. ఎవరికర్మవారనుభవించక తప్పదు కనుక, బుద్ధి మరోలా నిర్ణయించదు. శమించినప్పుడు మాత్రమే ఏకర్మానుభవము వచ్చినను అవుననక, కాదనక, అనుభవించుట సాధ్యపడును. ప్రారబ్ధమును అంగీకరించి ప్రతిస్పందించక ఊరకుండుట దమమనబడును. అనగా బాహ్యమైన కర్మేంద్రియములను కర్మలోనికి దిగనీయకుండా నిగ్రహించుట దమమగును. అంతరేంద్రియ నిగ్రహము శమమగును. శమము వలన దమము సాధ్యమగును. దమము వలన కర్మ వాయిదా పడి నీరసించి, శమము సాధ్యపడును. ఏకకాలములో శమదమాదులను సాధించు ప్రయత్నము చేయుచుండవలెను.

**విషయ పంచకము :-**

> **మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః**
> **బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం ॥**

మానవులలోనున్న మనసే బంధమోక్షాలకు కారణము. కాని మనసు విషయపంచకములను ఇష్టాయిష్టములతో స్వీకరించుచు, తగిన కర్మను



చేయుచున్నందున ఆ విషయములు బంధించుచు పునర్జన్మకు కారణమగు చున్నవి. అదే మనసు శమదమాదుల అభ్యాసముచే నిష్కామకర్మాచరణము వలనను మరియు వివేక వైరాగ్యములతో కూడిన కర్మకౌశలము వలనను విషయపంచకమునకు లోబడుటను జయించినచో, కర్మ అంటదు. తానేమి చేయుచున్నను తన మనసునందు నిర్విషయమే సదా స్మృతిగా నున్నచో, అదే ముక్తి. అందుకే నిర్విషయ స్మృతి కొఱకు సాధన చేయవలెను. విషయములేలాగున బంధించు చున్నవో చూడుము.

> **భుజంగ మాతంగ పతంగ భృంగ మీనాహతః**
> **పంచభిరేవ పంచ ఏకః ప్రమాదీన కథం**
> **నహ్యతేయః సేవతే పంచభింద్రియైశ్చ**

పాములు నాగస్వరము మీద ఆసక్తి చూపి పాములవానికి చిక్కి బంధింపబడుచున్నవి. ఇది శబ్ద విషయము. ఏనుగు ఆడ యేనుగు స్పర్శ కొఱకు నడచి వచ్చి అగడ్తలో పడి మావటివానికి చిక్కును. ఇది స్పర్శవిషయము. మిడత దీపకాంతికి ఆకర్షింపబడి, తాకి మాడి పోవును. ఇది రూపవిషయము. చేపలు ఎరను తినుటకై గాలమునకు చిక్కి నరులకు ఆహారమగును. ఇది రస విషయము. తుమ్మెదలు అడవి సంపెంగె వాసనలకు లోబడి ఆ సంపంగె పూరేకులు ముడుచుకున్నప్పుడు చిక్కి చచ్చుచున్నవి. ఇది గంధవిషయము.

ఒక్కొక్క జీవి ఒక్కొక్క విషయమునకు లోబడి నాశనమగు చున్నప్పుడు, మానవుడు విషయ పంచకమునకు ఒకేసారి లోబడు చున్నందున, ఎంత తీవ్రమైన బంధమును, నాశనమును కొని తెచ్చుకున్నాడో ఊహింపుము. మరికొన్ని ఉదాహరణలను చూడుము.

విశ్వామిత్రుని తపోభంగము చేయుటకు మేనక ఎదురుపడిన భస్మమగునను

భయముతో అందెలరవళి, గాజులగలగలలతో శ్రోత్రేంద్రియమున ప్రవేశించగా శబ్దవిషయమై విశ్వామిత్రుడు భంగపడెను. స్త్రీ స్పర్శకు లోబడిన కీచకుడు సైరంధ్రి అను దాసి రూపములోనున్న ద్రౌపదిని ఆశించెను. అందువలన వలలుడను వంటవాని రూపములోనున్న భీమసేనుని చేత చంపబడెను. సీతాదేవి యొక్క రూపమును ఆశించినందున, రావణుడు శ్రీరామునిచే వధించబడెను మరియు లంకకు చేటుతెచ్చెను. వాతాపి ఇల్వలులు నరమాంస రుచికోరి, బ్రాహ్మణులను పిలిచి, ఇల్వలుడు వాతాపిని మేకగా మార్చి తన పితరుల ఆబ్దికమని చెప్పి, మేకమాంసమును తినిపించెడి వాడు. ఆ బ్రాహ్మణుని కడుపులోని మేక బ్రతికి పొట్టను చీల్చి బయటకు వచ్చిన వెంటనే చచ్చిన బ్రాహ్మణుని యొక్క నరమాంసమును ఇద్దరును తినెడివారు. అగస్త్య మహాముని మేకను "వాతాపి జీర్ణం", "వాతాపి జీర్ణం", "వాతాపి జీర్ణం" అని ముమ్మారులు అనగానే మేక తిరిగి బ్రతుకలేదు. ఇల్వలుడు చింతించి శరణాగతి పొంది మంచిగా జీవించెను. రసవిషయమై వారిర్వురు భంగపడిరి. పరీక్షిన్మహారాజు నిమ్మపండును వాసనను ఆస్వాదించగా, అందులో పురుగు రూపములో చేరిన కర్కోటకుడను సర్పము కాటువేసి చంపెను. ఇది గంధవిషయము వలన జరిగినది. ఈ విధముగా విషయపంచకముపై ఆసక్తి వీడనిచో చావవలసి వచ్చును. అందువలన సాధకుడు విషయాసక్తిని వీడి జాగ్రత్తగానుండవలెను.

**విషయభావనచే దాను విషయమగును**
**శూన్యభావనచే దాను శూన్యమగును ।**
**బ్రహ్మ భావనచే దాను బ్రహ్మమగును గాన**
**బ్రహ్మనిధిధ్యాస బూనవలయు ॥**

**యత్ భావం తత్ భవతి.** ఏభావము నిలుపుకొని మరణింతురో మరో జన్మలో అదే భావనకు సంబంధించిన ఉపాధిని పొందెదరు. జడభరతుడు లేడిని పెంచి, తన మరణకాలమందు లేడిని తన భావమునందుంచు కొన్నందువలన, మరుజన్మలో లేడిగా పుట్టెను. కనుక విషయభావన, శూన్యభావన మొదలగునవి వదలి, కేవలము బ్రహ్మభావనను నిధిధ్యాసనగా బూనవలయును.

**బ్రహ్మభావన పావన వర్తనంబు**
**విడచి తిరిగెడి మానవుడడవి దిరుగు**
**పసరమునకంటె హీనుడై భ్రష్టుడగును గాన**
**బ్రహ్మనిధిధ్యాస బూనవలయు ॥**

బ్రహ్మభావన విడచి విషయములయందు పరువెత్తు మానవుడు, అడవిలో తిరుగు పశువుతో సమానము. మానవజన్మ నెత్తి కూడా బ్రహ్మ విచారణ చేయక మరియు బ్రహ్మను నిధిధ్యాసగా భావించలేని వాడు భ్రష్టుడగును.

**ఈషణత్రయము** :–

**సతులు సుతులు మాయ, సంసారములు మాయ,**
**ధనము ఘనము మాయ, తనువు మాయ ।**
**మాయ గెల్చువాడు మర్మజ్ఞుడగు యోగి,**
**విశ్వదాభిరామ వినురవేమ ॥**

సంసారమంటే భార్య, బిడ్డలు, ధనము. వీనియందు ఆశ మోహములున్నచో అదియే బంధము. ఎన్ని జన్మలందు ఎంతమంది తల్లిదండ్రులో, ఎంతమంది భార్యలో, బిడ్డలోగాని, గతజన్మలు గుర్తుండవు కనుక ఈ జన్మలోని వారే సత్యమని నమ్మిన వారికి వ్యామోహముండును. అన్ని జన్మలు గుర్తున్నవారికి ఎవరిపై మోహము? అటులనే పుట్టునప్పుడు తేలేదు ధనము.

పోవునప్పుడు తీసుకుని పోలేదు ధనము. జీవించుట తప్పదుగాని, దాచిన ధనము నీది కాదు గదా! తెలిసియు, ధనాశయేల? ఇదంతా మాయకదా!

**ఋణాను బంధరూపేణ పశు పత్ని సుతాలయాః**
**ఋణక్షయే క్షయం యాంతి కా తత్ర పరివేదనా?**

పూర్వజన్మలయందు ఒకరికి ఋణపడినట్లయితే, దానిని బట్టియే పశువులు, భార్య, బిడ్డలు, గృహము ప్రాప్తించును. ఋణము తీరిన వెంటనే ఒక్కొక్కటి తనకు దూరమగుచుండును. అంతేగాని యేదియు తనంతటతాను రాదు. తనంతటతాను పోదు.

**ఆలు బిడ్డలనుచు అతిమోహమున నున్న**
**ధనము మీద వాంఛతగిలియున్న**
**నట్టి నరులకెల్ల నవని ముక్తియే లేదు**
**విశ్వదాభిరామ వినురవేమ ॥**

అందువలన ధన, పుత్ర, కళత్రాదుల మీద మోహమును, వాంఛను వీడుము. నీవెంత కోరినను అవి నీకు ప్రాప్తించవు. కాని విషయవాసనల వలన అవి తీరుటకు గాను పునర్జన్మ నొందెదవు. ఇట్టి మాయ మర్మము తెలియకున్నచో ముక్తి లేదు. ధనము, భార్య, పుత్రుల మీద కలిగే వ్యామోహమును ధనేషణ, దారేషణ, పుత్రేషణయందురు. దీనినే ఈషణ త్రయ మందురు.

**ధనేషణ** :– ధనసంపాదనకై తపన, శ్రమపడుచు, సంపాదించిన ధనమును కాపాడుకొనుటకు బెంగపడుచు, నిరంతరము దుఃఖపడుచుందురు. ఖర్చైపోతున్నప్పుడు సంపద తరిగిపోతున్నదనియు, దాచిన సొమ్ము దొంగల పాలైనదనియు, కొంత ప్రభుత్వ పన్నుల రూపంలో పోయిందనియు చింతించుచునే యుందురు. అప్పుతీసుకుని ఎగవేయుదురు. అందువల్లను



దుఃఖమే. ధనము లేనప్పుడు దరిద్రమునను భవించుచు, దుఃఖపడు చుందురు. ధనము లేనివారు, ఉన్నవారుకూడా అన్యాయార్జితానికి అవినీతికి పాల్పడుట చూచుచున్నాము. **అన్యాయార్జితవిత్తం సమూలం వినశ్యతే.** శాస్త్రవచనము ప్రకారము అన్యాయముగా సంపాదించినధనము అంతేపోకుండా న్యాయముగా సంపాదించిన దానితో సహా ఊడ్చుకొని పోవునని ఉన్నది. ధనము ప్రోగైనప్పుడు దాయాదులతో వ్యాజ్యమువలనను లేక ఇతరుల ఈర్ష్య అసూయ వలనను దుఃఖపడుచుందురు. ధనమున్నంత వరకు బంధుమిత్రులు చుట్టూచేరెదరు. ధనముపోగానే ఎవరు అతనివంక చూడనిచ్ఛగించరు. **తెప్పలుగ చెరువునిండిన కప్పలు పదివేలు చేరు** అన్నట్లుగా బంధుమిత్రులు చేరి, అతనితో లాభము, సహాయమున్నంత వరకు అభిమానించుచు, సహాయము చేయనప్పుడు విరోధులగుదురు. తనకవసరమైనప్పుడు, వారు ముఖము చాటేయుచుందురు. అందువలన ధనేషణ విడువవలెను.

**ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుట కంటే, ఒంటె సూది బెజ్జములో దూరుట సులభము (మార్కు 10:25 బైబిల్).** ఇక్కడ ధనవంతుడనగా ధనేషణ యున్నవాడని యర్థము.

**తాము తినక, నటుల ధర్మము సేయక**
**కొడుకులకని ధనము కూడబెట్టి**
**తెలియచెప్పలేక తీరిపోయిన వెన్క**
**సొమ్ము పరులనంటు, జూడు వేమ ॥**

లోభత్వముచే, తాను తినకను, దాన ధర్మములు చేయకను, కొడుకులు దుబారాచేసెదరని వారికి చెప్పకను, అకస్మాత్తుగా మరణించిన పిదప అతడు దాచి యుంచిన సొమ్ము పరుల పాలగును. కనుక ధనేషణ వదలి, ప్రాప్తించిన

సొమ్మును యదృచ్ఛాలాభముగా ననుభవించుచు, దానధర్మములు చేసి, తాను బ్రతికి యున్నప్పుడే పంపకము చేసి నిశ్చింతగా నుండవలెను. పిమ్మట యేదియేమైనను తనకు సంబంధము లేనట్లుండవలెను.

**దారేషణ :–** కొద్దిమాత్రము సుఖము కోరినందున పెద్దసంసారమే కలిగినది. అనుకున్నంత సుఖము రాలేదు. కొందరికి సుఖమునకు బదులు దుఃఖమే మిగిలినది. కనుక అతిగా ఆశపడక, కేవలము తన సుఖము కోసముగాక, సంసారములో ఇతరుల సుఖము కొఱకు త్యాగము చేయుచు, శ్రమించినచో దుఃఖమును తప్పించుకొనవచ్చును. గృహస్థాశ్రమమును పవిత్రముగాను, బాధ్యతగాను భావించి, యితర ఆశ్రమవాసులకు ఉపయోగముగా జీవించవలెను. సత్కర్మానుష్ఠానములందు భార్యను తన అనుయాయిగాను, తనతో సమానమైన గౌరవముండునట్లు చూచుకొన్నచో సంసారబంధము కొంతసడలి, శాంతము లభించును. అయినను సాధన వలననె పరమశాంతి యనెడి ముక్తి లభించును.

**పుత్రేషణ :– అపుత్రస్య గతిర్నాస్తి** అనియందురు. పుత్రులు పుట్టకపోతే పున్నామ నరకమునుండి రక్షించు వారెవరు? అని చింతించెదరు. వారి వృద్ధాప్యమందు అవసరమైతే సేవచేసెదరని అనుకొందురు. విదేశములలో ఉద్యోగము చేయుచు, తల్లిదండ్రులను వృద్ధాశ్రమమునకు పంపెడి పుత్రులను చూచుచున్నాము. పుత్రులు లేని సనకసనందనాదులు సద్గతినొందలేదా? భీష్మ, నారద, హనుమలకు పుత్రులు లేరు అయినను వారు ముక్తి బడయలేదా? శ్రీకృష్ణ నిర్యాణము తరువాత కొంతకాలము జీవించి మరణించిన దేవకీ వాసుదేవులకు పుత్రునిచే తర్పణలు లేకనే ముక్తి కలిగినది గదా! కనుక పుత్రేషణ అనవసరము. ముక్తి కొఱకు ఎవరి



సాధన వారే చేయవలెను. పాపాత్ములైన వారు, వారి పుత్రులు పితృకార్యము చేసినంతమాత్రమున తరించలేరు.

మృగములకు పుత్రేషణ యధికము. పక్షులకు దారేషణ అధికము. మానవులకు ధనేషణ అధికము. ఏమైనను మానవులు ఈషణత్రయమును విడచి జ్ఞానమును సముపార్జన చేసి సద్గతిపొందవలెను.

**తితీక్ష ఉపరతులు :–**

**ఇంద్రియార్థములగు విషయేచ్ఛలందు**
**విముఖుడై యుండుట యుపరతి పేర బరగు**
**సకల దుఃఖ ప్రపంచము సైచునోర్మి**
**కమరియుండు తితిక్ష సమాహ్వయంబు ॥**

రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు, న్యాయాన్యాయాలు, మంచిచెడులనెడి ద్వంద్వములను నిగ్రహించి సమదృష్టిని సాధించుటయే తితీక్ష యనబడును. శరీరానుసారమైనట్టి విషయసుఖములందు భోగేచ్ఛ మాని, దేవుని ఆరాధనయందును, గురుబోధయందును తన బంధవిముక్తిని సూచించు శాస్త్రవాక్యములందును ఆసక్తికలిగియుండుట ఉపరతి యనబడును.

**శ్రద్ధ సమాధానములు :–**

**వేదవాణియందు, విద్యాగురుని వాక్య**
**సరణియందు భక్తి శ్రద్ధ యంద్రు,**
**బ్రహ్మయందు బుద్ధిపాయకుండుట సమా**
**ధానమని వచింత్రు తత్త్వవిదులు ॥**

బ్రహ్మజ్ఞానమును కల్గించుటను తెలుపు వేదశాస్త్రములయందును, శిష్యుని తరింపచేయగల సద్గురువు యందును, అమితమైన భక్తి విశ్వాసాలుండుట

ను శ్రద్ధయందురు.

గుర్వాజ్ఞానుసారము వినయ విధేయతలతోను, సర్వసమర్పణ భావముతోను నడచుకొనవలెననెడి పట్టుదలను సమాధానమందురు. **నేనుఎవరు?** అను ప్రశ్నకు అనుభవపూర్వకముగా **నేను బ్రహ్మను** అను జవాబు కలుగుటను సమాధానము అందురు. సాధనయందు పట్టుదలతో యిట్టి సమాధానమును నొందవలెను. శ్రద్ధ గలవాడు పట్టుపట్టి సాధించును.

**పట్టు పట్టరాదు, పట్టి విడువరాదు**
**పట్టెనేని బిగియ బట్టవలయు**
**పట్టు విడుట కన్న బరగ జచ్చుట మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ ॥**

ఆత్మవిద్య యందు శ్రద్ధగలిగె నేని, పట్టు గట్టిగా పట్టి విడువరాదు. ఒకసారి పట్టి విడచిపెట్టినచో, అంతకంటే చావు మేలు. పట్టు బట్టితే తుదవరకు సాధన చేసి సమాధానమైన ఆత్మానుభవము పొందే వరకు విడచి పెట్టే సమస్యేలేదు.

**ముముక్షుత్వము** :– మోక్షము అనునది ఇష్టపడటము, ఇష్టపడకపోవటము వంటిది కాదు. అదే చదువుకునే వారైతే ఇంజినీరు చదువుదామా? లేక డాక్టరు చదువుదామా? అంటే, నాకు డాక్టరు చదువంటే యిష్టమని ఇంజినీరింగు ఇష్టముకాదని యనవచ్చును. ఇష్టాయిష్టములతో సంబంధములేక అందరికిని ఆత్మవిద్య అత్యవసరము. ఇది వృద్ధాప్యములో కాలక్షేపానికి నేర్చుకునేది కాదు. అన్ని వయసులవారికి అన్నికులములవారికి, అందరికిని జన్మదుఃఖం, జాయాదుఃఖం, జరాదుఃఖం నుండి తప్పించుకొని, దుఃఖనివృత్తి చేసికొనవలసిన అవసరము ఉంది. శాశ్వతానందము అనే మోక్షము ఎవరికైనను తప్పదు. అయినను అజ్ఞానము వలనను, కష్టములు



మరీ ఎక్కువగా లేనందునను మోక్షేచ్ఛయుండదు. కొందరు పెద్దలచే ముక్తి విషయమును వివరముగా తెలిసికొన్నప్పుడు కొందరు ఆరంభశూరత్వము గా, ఈ ప్రపంచముపై వైరాగ్యము కలిగి సాధన మొదలు పెట్టవలెనను కొందురు. కాని కార్యాచరణయుండదు. దీనిని పురాణ వైరాగ్యమందురు. అటులనే మొదటి కాన్పు కష్టమైనప్పుడు, యిక పిల్లలు వద్దని భర్తకు దూరముగా ఉండాలని అనుకుంటారు. (కుటుంబ నియంత్రణ లేని రోజులలో) కాని రెండవ సంతానానికి సిద్ధపడతారు. ఇది ప్రసవ వైరాగ్యము. స్మశానము నుండి ఆత్మీయులను దహనము చేసివచ్చిన వెంటనే యెవరైనా యింతేకదా యని వైరాగ్యము కల్గుతుంది. వెంటనే జీవవ్యాపారాన్ని ఆసక్తితో మొదలు పెట్టేస్తారు. ఇది స్మశాన వైరాగ్యము. ఇట్టి వైరాగ్యముగా మొదలు పెట్టే సాధన మంద మోక్షేచ్ఛ అందురు.

కష్టాలలో ఉన్నవారు ఆత్మవిద్య నేర్చుకోవడానికి వచ్చి, సాధన కష్టముగా ఉందని గాని, కష్టాలు తొలిగిపోయాయనికాని, కాస్త ఊరట కలుగగానే మానివేయుదురు. వీరిది మధ్యమోక్షేచ్ఛ.

ఇల్లు తగలబడుతుంటే, సామాను, ధనము, ఆలుబిడ్డలను రక్షించుకొనక ముందుగా తననుతాను రక్షించుకొని, వీలైతే మిగిలిన వారి సంగతి ఆలోచించినట్లు, సంసారదుఃఖమునుండి ఎట్లైనను విడుదల కావలెననెడి తపనచేత ఆత్మవిద్య నేర్చుకొను వారిది తీవ్రమోక్షేచ్ఛ.

**దుఃఖహేతువీ సంసార దురితమెట్లు**
**వాయు? నెన్నడు వాయు? దైవమా! యటంచు**
**నిరతము దపించు నట్టి మనీషి కలిమి**
**యది మముక్షుత్వమని యెంతురాత్మ విదులు ॥**

ఈ సంసారమనే భవమును పోగొట్టు కొనుట యెట్లు? ఎప్పుడు ?

ఓ దైవమా ! యిక నాకు యీ బంధించే సంసారంపై రాగము, ఆశ లేవు. అప్పుడప్పుడు ఫరవాలేదనిపించే విరామము కూడా వద్దు. అని నిరంతరము తీవ్రతపన పడుటయే తీవ్రమోక్షేచ్ఛ. ఇతడు దుర్లభమైన మానవజన్మను వృథాకానీయడు.

సాధనాచతుష్టయ సంపత్తి యందలి నాల్గు అంశములైన (1) నిత్యానిత్య వస్తువివేకము, (2) ఇహాముత్ర ఫలభోగ విరాగము, (3) శమాది షట్క సంపత్తి, (4) ముముక్షుత్వము, అన్నీ ఉన్నవాడే బ్రహ్మవిద్యకు అధికారి. ఇందులో ఏ ఒక్కటో, రెండో, మూడో ఉన్న చాలదు. నాల్గును సాధించవలెను. అట్లుకానిచో ఫలితముండదు. ఏ పని తలపెట్టినను మధ్యలో ఆపరాదు. దాని ఫలితమును రాబట్టవలెను. మధ్యలో ఆపినవాడు ఇహానికి, పరానికి రెండింటికి చెడును మరియు భ్రష్టుడగును. పెద్దచదువులకు ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణమైన వాడే అధికారి. అట్లే యీ సాధనాసంపత్తికూడా. అధికారి కానివానికి బ్రహ్మవిద్య చెప్పినచో గురువు హేళనకు గురియై, శిష్యుడే నష్టపోవును. కాలయాపన తప్ప ఫలితముండదు. వ్యాపార వ్యవసాయములను ఒక ప్రణాళికతో, కష్టపడి చేసినప్పుడు ఫలితమును ఎట్లు ఆశించెదమో, బ్రహ్మజ్ఞానము కొఱకు చేసెడి సాధనకూడా అట్లే మంచి ఫలితమును తప్పక యిచ్చును. ఆధ్యాత్మిక జీవితము కాలక్షేపము కాదు. మరియు చాదస్తము కాదు ! నవ్వి పోయినవారు కూడా ఎప్పుడో ఒకప్పుడు వారి దుఃఖ భూయిష్టమైన సంసార బంధమునుండి విడుదలై శాశ్వతానందము నొందుటకు, యిట్టి సాధనకు రాక తప్పదు. యీ జన్మలో కాకపోతే మరోజన్మలోనైనా యిదే పరిష్కారము. ఇంతకంటే వేరే యేమీ లేదు. మహాపురుషులుగాని, అద్భుతములు చేయువారుగాని, దైవముగాని రక్షింతురని అనుకొందురేమో! వారు కూడా ఒకరి కర్మను మార్చలేరు.



ఒక్క గురువే జ్ఞానము కొఱకైతే విధివ్రాతను మార్చగలడు, అదియు శిష్యుని సాధనకది ఆటంకమైనప్పుడు మాత్రమే ! కనుక సాధన చేయ్ తండ్రీ ! తప్పదు నాయనా ! ఈ జన్మలోనే, యిప్పుడే మొదలుపెట్టు బిడ్డా! మొదలు పెట్టాలంటె పిల్లల చదువులు, పెళ్ళిల్లు అయిన తరువాతనేనని, రిటైర్ అయిన తరువాతనని వాయిదావేస్తారు. సమస్యలు తీరిన తరువాత అని అంటారు. ఇవి ఎప్పుడూ ఉండేవే. ఈ జీవితం అంతులేనికథ. కనుక అనుకున్న వెంటనే సాధన మొదలుపెట్టాల్సిందే. ఎందుకంటే అలలు తగ్గాక సముద్రంలో స్నానం చేద్దామనుకుంటే అది కుదరదు. సముద్రానికి అలలు సహజము. అవి తగ్గవు. ఎలాగైతే ఒడుపుగా స్నానం చేస్తామో, అలాగే సాధనకూడా!

## 12. బ్రహ్మ విద్యకు అర్హులు

బ్రహ్మవిద్యాభ్యాసమునకు వర్ణబేధములేదు. ఏ కులము వారైనను అర్హులే. స్త్రీలు కూడా అర్హులే. జ్ఞానులైన వారిని పరిశీలింతము. సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు, వశిష్ఠుడు బ్రాహ్మణులు. విశ్వామిత్ర జనకులు క్షత్రియులు. తులాధరుడు వైశ్యుడు. ఉద్ధవుడు, సూతమహాముని శూద్రులు. వాల్మీకి, కన్నప్పలు కిరాతకులు. నందనారు పంచముడు. వివాహిత స్త్రీలలో చూడాల, మదాలస, మైత్రేయిలు జ్ఞానులు. బ్రహ్మచారిణి స్త్రీ పౌతిమాషి. గృహస్థాశ్రమమునుండిన జ్ఞానులైనవారు వశిష్ఠ, జనకులు. కొంతకాలము గృహస్థునిగా నున్నవారు విశ్వామిత్రుడు, యాజ్ఞవల్క్య. నైష్ఠిక బ్రహ్మచారులు సనక సనందనాదులు, శుకుడు. నారదుడు, శబరి, అరుంధతి వంటివారు బ్రాహ్మణ కులమందు జన్మించకనే జ్ఞానులైరి. కనుక అందరూ అర్హులే. ఎంతకాలములో జ్ఞాని కావచ్చును అను విషయమును పరిశీలింతము.

పరీక్షిన్మహారాజు శుకునివద్ద భాగవత శ్రవణము వలన ఏడు రోజులలో ముక్తుడయ్యెను. ఖట్వాంగ ధరిత్రుడు ఒక ఘడియలో రాజ్యాధికారమును, బాధ్యతలను యితరులకు అప్పగించి, రెండవ ఘడియలో ముక్తుడయ్యెను.

హిరణ్యగర్భునికి **అహం బ్రహ్మాస్మి** జ్ఞానం వేదాంత శ్రవణము లేకనే కల్గినది. అతనికి జన్మాంతరమందు చేసిన శ్రవణము యొక్క ఫలితముగా, ఈ జన్మలో వాక్యార్థ శ్రవణము కలిగినది. భృగువునకు చాలాకాలము తండ్రివద్ద శ్రవణము చేసిన తరువాత కలిగినది. శ్వేతకేతువు తండ్రి ఉద్దాలకుని వద్ద 9 పర్యాయములు మహావాక్యములను విని, తరువాత దాని అర్థము స్ఫురణకు రాగా, జ్ఞానము కలిగినది.



వ్యసన పరుడైన వేమన అదే జన్మలోనే యోగియయ్యెను. పింగళ యను వేశ్యకు జ్ఞానము కలిగినది. కనుక నా వంటి పాపాత్మునికి ముక్తి కలుగునా? యను సందేహము వలదు. ఎట్టి వారైనను సాధనాచతుష్టయ సంపత్తి కలిగి ఆత్మవిద్య నేర్వవచ్చును మరియు తరించవచ్చును. అసలు కుల వ్యవస్థ ఎట్లు కలిగినదో పరిశీలింతము.

**శమోదమస్తపశౌచం క్షాంతిరార్జవ మేవ చ**
**జ్ఞానవిజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావమ్ ॥**

శమము, దమము, తపస్సు, శౌచము, ఓర్పు, భగవంతుడున్నాడను ఆస్తిక్యబుద్ధి – ఇట్టి గుణములెవరికి కలవో అతడే బ్రాహ్మణుడు.

**శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్య పరాయనం**
**దానమీశ్వర భావశ్చ క్షాత్రం కర్మ స్వభావమ్ ॥**

శౌర్యము, తేజస్సు, ధైర్యము, దాక్షిణ్యము, యుద్ధమున పారిపోకుండుట, దాన గుణము, ఈశ్వరభావము యెవరికి యున్నవో, అతడే క్షత్రియుడు.

**కృషి గోరక్షణ వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావమ్ ॥**

వ్యవసాయము, గోవుల సంరక్షణ, వ్యాపారం చేయుట వైశ్యుని కర్మ స్వభావము. శూద్రుడైన వాడెవడంటె, పైమూడు విధములైన స్వభావము లేనందున అతడు సమాజ శ్రేయస్సునకై పై మూడు వర్ణముల వారికి సహాయము చేయుచు బ్రతుకవలెను.

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగ కశః ॥**

భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పినదేమంటే “వారి వారి కర్మ స్వభావమును బట్టి నాలుగు వర్ణములు నాచే కల్పించ బడినవి”.

వారసత్వముగా తలిదండ్రుల ద్వారా కలిగిన కులములు చెప్పలేదు. తలిదండ్రుల ద్వారా సంక్రమించిన కులములోని వారెవరైనను, గుణస్వభావము మార్చుకొన్నచో అగ్రకులమగుదురు. అందువలన జన్మతః వచ్చిన కులమును ఎవరును ఉచ్ఛ నీచములుగా చూడరాదు.

**జన్మనాజాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః ।**
**వేద పాఠంతు విప్రాణం, బ్రహ్మజ్ఞానంతు బ్రహ్మణః ॥**

జన్మించిన వెంటనే అందరూ శూద్రులే. సత్కర్మ వలన సంస్కరింప బడినవారు ద్విజులు. వీరు ఆత్మానుసారము జీవించుటకు సంసిద్ధులు. వేదమును పఠించినవారు విప్రులు. బ్రహ్మజ్ఞానియైన వాడు బ్రాహ్మణుడు.

ఇట్టి సంస్కారమే మంగళాచరణము. అనగా బ్రహ్మవిద్యయను గొప్ప విషయమును, శిష్యుని ఆర్తి ననుసరించి, శ్రీగురుమూర్తి నుండి శిష్యునికి బ్రహ్మజ్ఞాన ప్రాప్తి కలుగునట్లు ఆశీర్వాదము పొందగోరుచున్నాడు.



## 13. మహావాక్యములు

**వన్దే గురూణాం చరణారవిందే సందర్శిత స్వాత్మ సుఖావబోధే ।**
**జనస్యయే జాంగలింగాయమానే సంసార హాలాహల మోహశాన్త్యై ॥**

తా॥ లౌకికవిషయాల వలన కలిగే విషము వంటి దుఃఖాన్ని తొలగించి జ్ఞానమే నా నిజస్వరూపమని బోధించి, నన్ను రక్షించే గురు పాద పద్మములకు నమస్కారము చేయుచున్నాను.

మహత్తరమైన 1180 ఉపనిషత్తులలో 108 ఉపనిషత్తులు ప్రధానము మరియు అందుబాటులోనున్నవి. మిగిలినవి కాలగమనములో కనుమరుగైనవి. 108 ఉపనిషత్తులలోను దశోపనిషత్తులు మాత్రమే ఆత్మ, బ్రహ్మవిషయమును, జ్ఞానమును తెలియజేయుచున్నవి. అవేమనగా (1) ప్రశ్నోపనిషత్తు, (2) ముండకోపనిషత్తు, (3) మాండూక్యోపనిషత్తు, (4) తైత్తరీయోపనిషత్తు, (5) ఛాందోగ్యోపనిషత్తు, (6) బృహదారణ్యకోపనిషత్తు, (7) ఐతరేయోపనిషత్తు, (8) ఈశావాస్యోపనిషత్తు, (9) కేనోపనిషత్తు, (10) కఠోపనిషత్తు అని పది ఉపనిషత్తులు.

వీటన్నింటిలో మహావాక్యములు కొన్నియున్నవి. బ్రహ్మజ్ఞానము కోరువారి సౌలభ్యము కొఱకు నాలుగు వేదములనుండి కేవలము నాలుగు మహావాక్యములను యెంచి శిష్యులకు క్లుప్తముగా బోధించుట సాంప్రదాయముగా వచ్చుచున్నది. అయినను ఈ వాక్యార్థములను గురుముఖముగా నేర్చుకొన్న గాని పూర్తి ఫలితము రాదు.

**(1) ప్రజ్ఞానం బ్రహ్మ** :- ఈ మహావాక్యము ఋగ్వేదములోని ఐతరేయో పనిషత్తులో చెప్పబడిన లక్షణవాక్యము.

ప్రజ్ఞానమంటె శుద్ధతెలివి. ఈ తెలివి మనసు ద్వారా ప్రకటించ బడినప్పుడు ఆలోచనలుగాను, జ్ఞానేంద్రియముల ద్వారా ప్రకటించినప్పుడు

శబ్ద స్పర్శ రూప రస గంధ విషయములను తెలిసికొనుటగాను కనుపించు చున్నది. ఆ శుద్ధతెలివి లేనిచో, మనసు, ఇంద్రియములు విషయములను గ్రహించగల తెలివిలేనివగుచున్నవి. ఈ తెలివినే ప్రజ్ఞానమనియందురు. విషయజ్ఞానములేని శుద్ధతెలివియే ప్రజ్ఞానము. విషయములు మనసులోని వాసనల వలన గ్రహించబడు చున్నవి. ఏ విషయవాసనా లేనివానికి శుద్ధతెలివి అనుభవములోనికి వచ్చును. ఈ ప్రజ్ఞ మానవునిలో **నేను**గా స్ఫురించుచున్నది. ఈ **నేను**ను ఆధారము చేసికొని మనసు, బుద్ధి, ఇంద్రియములు పనిచేయుచున్నవి. **నేను**కు ఇచ్ఛా ప్రయత్నములు లేకనే సహజముగా ప్రకాశించు లక్షణముండుట వలన, ఆ ప్రకాశమునాధారము చేసికొని, మనసుకు సంబంధించిన వాసనలు, గుణముల కనుగుణముగా మానవుడు ప్రవర్తించుచు, కర్తగా భోక్తగా అనుభవముల నొందుచున్నాడు. దీనినే అసత్యనేను లేక అహంకారము అనుచున్నాము.

ఈ **నేను** సూర్యుని ప్రకాశమువలె లక్షణముగానున్నప్పుడు, సూర్యుని నుండి వెలువడు ఉష్ణ, శీతల, హిమకిరణముల చేత కలుగు రేయింబవళ్ళ లోను, ఋతువులలోను, వృక్షములు, జీవరాశులు, మానవులు వారికి తగినట్టి లబ్ధిని పొందుచున్నవి. సూర్యుడు మాత్రము సముద్రములోని ఉప్పునీటినుండియు, మురికి నీటినుండియు, మంచినీటినుండియు మలము నుండియు కూడా సమానముగా జలమును పీల్చుచున్నాడు. సూర్యుని వలన జరిగే ఈ పనుల యందు సూర్యునికి పక్షపాతము లేదు మరియు ఇచ్ఛా ప్రయత్నములు లేవు. ఇవన్నియు చేయుటలో సూర్యుడు కర్తగాదు, భోక్తకాదు. కేవలము ఆధారము, అధిష్ఠానము. ఎందుకంటే సూర్యుడు లేకుంటే రేయింబవళ్ళు లేవు, ఋతువులు లేవు, వర్షములు రావు. జీవులు బ్రతుకజాలవు. అట్లే మనలో **నేను** అనబడే ప్రజ్ఞలేనిదే ఏమియు



తెలియజాలరు.

ఈ ప్రజ్ఞనే సాక్షియందురు. అన్ని జీవరాశులయందున్నది ఆ ప్రజ్ఞయేననియు ఆ ప్రజ్ఞ ఎన్నింటియందున్నను అఖండముగా ఒక్కటిగా నున్నదనియు ఋజువు చేయవచ్చును. ప్రజ్ఞయనునది శాశ్వతము. దానికదే ప్రకాశించుచు, ఇతర వస్తువులను, జీవులను ప్రకాశింపజేయుచున్నది. ఎవరైతే మనసుని జయించి స్థితప్రజ్ఞుడగుచున్నాడో అతడు బ్రహ్మానందము ను అనుభవించుచున్నాడు. అందువలన ప్రజ్ఞానమే బ్రహ్మము.

**అహం బ్రహ్మాస్మి** :– ఇది యుజుర్వేదములోని బృహదారణ్యకోపనిషత్తులోని అనుభవవాక్యము. ఆత్మప్రకాశము వలన ఒక్కొక్క శరీరములో (ఉపాధిలో) తన బుద్ధిలో నేను, నేను అనెడి ఉనికి స్ఫురించుచున్నది. దీనిని అహం అని యందురు. ఇది నిజానికి ఆత్మకు ప్రతిబింబము. కాని ఈ అహంకు వృత్తికలిగి మనసుగా ప్రవర్తించుచు మనసుకును, తనకును భేదము లేనట్లు అనుభవించుచున్నది. నిజానికి అహం అంటే వృత్తిలేని బ్రహ్మాభావము. వృత్తులన్నీ మనసుకు సంబంధించినవి. ఇట్లు మనోవృత్తులను అహం వృత్తులుగా భావించుట అజ్ఞానము. వృత్తులనుండి నేనును వేరుచేయుట మొదటివాక్యమైన ప్రజ్ఞానంబ్రహ్మ వలన సాధ్యమైనది.

అది ఎలాగంటే శుద్ధతెలివియొక్క అనుభవము నిర్విషయమైనప్పుడది నేను అనెడి ప్రజ్ఞానానుభవము. మనోవృత్తులు ఆగినప్పుడే మనసు నిర్విషయమగుచున్నది. కనుక అజ్ఞానము మనసునకే యని తేలినది. మనసుకును, నేనుకును విభజన లేనప్పుడది అసత్యనేను. మనసును వేరు చేసి, **నేను**ను అనుభవించుచున్నప్పుడది ఆత్మానుభవము. ఆత్మయనగా బ్రహ్మమే. ఈ **నేను** బ్రహ్మమగుచున్నది. అప్పుడు ఈ అనుభవమును పొందిన సాధకుడు **నేను బ్రహ్మనైతిని** అని అనుచున్నాడు.

అనగా **అహంబ్రహ్మాస్మి** యని వాక్యార్థము.

**తత్త్వమసి** :- ఇది సామవేదమునందు ఛాందోగ్యోపనిషత్తులోని ఉపదేశ వాక్యము. వికారములు చెందే దేహేంద్రియ ప్రాణమనసుల యొక్క విషయానుభవములను విడచి, ఆధారమైనట్టిదియు, లక్ష్యార్థమైనట్టిదియు యైన **నేను** లేక **ప్రజ్ఞానము** బ్రహ్మమని పైరెండు వాక్యములలో సారముగా తెలిసినది. శిష్యుడు తాను బ్రహ్మమనెడి లక్ష్యమును అనుభవించినప్పుడు, అతడికి ఇంకను పరబ్రహ్మానుభవము కలుగలేదు. ఎందుకనగా బ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే. కాని **అహం** అనేది రెండవదిగా ఉండి తాను బ్రహ్మమని తెలుపుచున్నది. అందువలన రెండవది అయిన **అహం** పోవలెను. ఈ **అహం** పోయి ఒక్కటైన బ్రహ్మము మిగులుటకు గురువు తత్త్వమసి మహావాక్యమునుపదేశించుచున్నాడు.

"త్వం" అనగా నీవు. ఈ మాటను గురువు శిష్యుని సంబోధించి పిలిచెడిది. అనగా శిష్యుడు **అహం బ్రహ్మ** అన్నప్పుడు, గురువు **త్వం బ్రహ్మ** అను చున్నాడు. కాని నీవు అదే అనగా తత్ + త్వం + అసి అనుచున్నాడు. తత్ అనగా అది, అసి అనగా అభేదము అనగా భేదము లేదు. ఈ విధముగా అనుటకు కారణము పరబ్రహ్మ స్త్రీ కాదు, పురుషుడుకాదు, నపుంసకముకాదు. అందువలన 'అది' అనవలసివచ్చినది. 'నీవు అది అయిఉన్నావు' అనగా నీవు పరబ్రహ్మమే యని అర్థము. ఈ విధముగా గురువు శిష్యునికి చెప్పడమంటే ఇది గురూపదేశవాక్యము. గురువు యొక్క ఆశీర్వాద వాక్యము. గురుకృప వలన గురువు అతనిలో ప్రవేశించగా, శిష్యుడు తాను పరబ్రహ్మమేనను అనుభవసిద్ధు డగుచున్నాడు. వాక్యార్థము చూచినట్లైతే అహంబ్రహ్మలో అహం అనెడిదికూడా విడచి కేవలం బ్రహ్మము మిగిలినది. **నేను** ఉండి బ్రహ్మమునని నిర్ణయించినది జ్ఞానము.



**నేను** కూడా పోయి కేవల బ్రహ్మము మిగులుట విజ్ఞానము. బ్రహ్మమొక్కటే గనుక అహం స్ఫురణ కూడా ఆగిపోవునట్లు చేయునది **తత్త్వమసి** వాక్యము.

అయమాత్మ బ్రహ్మ :- ఇది అథర్వణ వేదమునందు మాండూక్యోపనిషత్తులో చెప్పబడిన సాక్షత్కార వాక్యము. తాను బ్రహ్మము, కాని ఆయనుభవము చెప్పడానికి 'నేను' లేదు. ఇక బ్రహ్మ అనుభవమును చెప్పేది ఎవరు? అందుకే బ్రహ్మానుభవము అవాంగ్మానసగోచరమని యందురు. అనగా వాక్కుకును మనస్సుకును అందనిది. ఇంద్రియగోచరము కానిది, అనిర్వచనీయము. అనుభవమే తానైనట్టిది. ఇదియే సాక్షాత్కారము. ఇదియే అపరోక్షానుభవము. కాని బోధ సమాప్తికొఱకు 'ఈ ఆత్మయే బ్రహ్మము' లేక అయమాత్మా బ్రహ్మ' అని ఇంకను బోధను స్వీకరించే వారి కొఱకు చెప్పడమైనది. ఈ అనుభవము సిద్ధించినవారు మాత్రము అయమాత్మ బ్రహ్మ యని అనరు. ఇది తత్త్వమసి అని గురువు యొక్క ఆశీర్వాద ఫలితముగా శిష్యునిలో కలిగిన విజ్ఞానము.

బ్రహ్మ విచారము చేయవలెనవిన నాల్గు మహావాక్యములను, వాక్యార్థములను శ్రవణ మనన నిధిధ్యాస చేయవలెను. ఎంతకాలము బ్రహ్మవిచారణ చేయవలెను? ఒకని మనసు సంపూర్ణముగా సందేహరహితమగు వరకును మరియు ప్రశాంతినొందేవరకునూ విచారణ చేయుచునే యుండవలెను.

త్రిగుణములు, రాగద్వేషములు, అరిషడ్వర్గము, అహంకారములను తొలగించుకొనుటను నివృత్తి మార్గమందురు. మహావాక్యవిచారణ చేత తాను బ్రహ్మమను జ్ఞానము ఆరూఢము చేసికొనుటను ప్రవృత్తిమార్గ మందురు. బోధ పూర్తియైన పిదప, ఆరూఢమగునంతవరకు నివృత్తి ప్రవృత్తి మార్గముల రెండింటిని ఏకకాలములో సాధించవలెను.

# 14. సాధన

భక్తి, జపము, ధ్యానము, యోగము, నిష్కామకర్మయోగము, తపము, అనెడి అనేక సాధనలున్నవి. ఇవి అన్నియు చిత్తమాలిన్యమును పోగొట్టి బ్రహ్మజ్ఞానార్జనవైపు మరలించునవే. ఎన్ని పూజలు, పవిత్రమైన కర్మకాండలు జరిపినను అవి అన్నియూ చిత్తశుద్ధి కొఱకే. **చిత్తశుద్ధిలేని శివపూజలేలయా?** అన్నారు. చివరకు జ్ఞానము వల్లనే ముక్తి కల్గునని నిర్ణయము. **జ్ఞానం వినా ముక్తిర్నముచ్యతే**. జ్ఞానం లేకుంటే ముక్తి కలుగదు. అందువలన ఎన్నో సాధనలు, సత్కర్మలు చేసిన పిమ్మట, ఆత్మ – అనాత్మ వివరములు తెలిసికొని సాధకునియొక్క దేహమందును, ప్రపంచములోను, విడదీసికొని, తాను ఆత్మననియు, అనాత్మ తానుకాదనియు నిరంతర చింతన చేయవలెను.

ఇంతవరకు బంధించెడి గుణములను, అరిషడ్వర్గమును, అహంకారము మొదలైనవాటిని మరియు విషయాసక్తిని వివరించడమైనది. ఇట్టి అనాత్మ భావన విడచుటకును, సాధన సంపత్తితో బ్రహ్మవిద్యకు అధికారియగుటను బోధగా చెప్పడమైనది. నాల్గుమహావాక్యముల ద్వారా **నేను** అనెడి ఆత్మ బ్రహ్మమేనని కూడా చెప్పడమైనది. ఇక ఇప్పుడు ఈ క్రింది విధముగా చింతన చేయుట మంచిది.

**నిర్వాణషట్కము:** (ఆత్మభావన చేయుచు అనాత్మ భావన నుండి విడుదలగుట) మనసు నేను కాదు, బుద్ధి నేను కాదు, చిత్తము కాదు నేను. అహంకారము కూడా కాదు నేను. వినే చెవి కాని, చూచే కన్నుగాని నేను కాదు. జిహ్వా నాశికలు నేను కాదు. పంచ భూతములు నేను కాదు. పంచప్రాణములు నేను కాదు. అన్నము వలన కలిగి పుట్టి పెరిగేది నేను కాదు. క్షీణించి నశించు అవయవ సహిత దేహము కాదు నేను. రక్త మాంసాది



సప్తధాతువులు నేను కాదు. మంచి చెడు పనులు చేయునది నేను కాదు. ఇంద్రియములు ఏవియూ కాదు నేను. అందువలన నాకు లేవు కామ క్రోధాదులు. నాకు లేవు రాగద్వేషాదులు. మానావమానాలు లేవు నాకు. సుఖదుఃఖాలు లేవు నాకు. జన్మకర్మలు లేవు నాకు. పాపపుణ్యములసలే లేవునాకు. శరీరానుసారులైన అనాత్మకే ఇవన్నీ, కాని ఆత్మకెన్నడు ఏమి లేవు. శరీరము నేనను వారికే తల్లి తండ్రి బంధుమిత్రులనెడి అష్ట పాశములును. ఆత్మ ఒక్కటే గాని ఆత్మకితరము లేదు. అట్టి ఆత్మను నేను. నేను ఆత్మను. గుణ కర్మ స్వభావము, దేశకాల పదార్థములు, నామరూప క్రియా నటనలన్నీ అనాత్మకే గాని, నాకు లేవు. ఆత్మ నిత్యం, ఆత్మ సత్యం, ఆత్మ ఏకం, అఖండం. అట్టి ఆత్మ నేను. పరమాత్మ నేను. పరిశుద్ధాత్మ నేను. శివాత్మ, సూత్రాత్మ, సర్వాత్మ యనబడే ఆ ఒక్కటే నేను. అహం బ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ, పరబ్రహ్మ నేను.

నేను సచ్చిదానందుడను, సచ్చిదానందుడనే నేను. శివుడను నేను, నేనే శివుడను. బ్రహ్మయే నేను, నేనే బ్రహ్మమును. బ్రహ్మ తప్ప మరేమియు లేదు. అంతా బ్రహ్మమే. ఇక నేను కూడా లేదు.

బ్రహ్మమే ఉన్నది! బ్రహ్మమే ఉన్నది! బ్రహ్మమే ఉన్నది!

సమాప్తము

ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః